Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 335 మేడ్చల్ మల్కాజ్‌గిరి 24 డిసెంబర్ 2023 ఆదివారం పేజీలు : 4

## మరో అణుపరీక్షకు చైనా సిద్ధం?

న్యూఢిల్లీ : కమ్యూనిస్టు చైనా మరోమారు అణుపరీక్షకు సిద్ధమవుతోంది. ఈ మేరకు అరవయ్యేళ్ల క్రితం చైనా భూభాగంలో అణు పరీక్షలు జరిగిన ప్రాంతంలో జోరుగా ఏర్పాట్లు జరుగుతున్న ట్లు పశ్చిమ దేశాల నిఘావర్గాలు గమనించాయు. వాయు వ్య చై నాలో టిబెట్‌-మంగోలియాల మధ్యన ఉయ్‌గర్ ముస్లింలు అధికం గా ఉండే జింజియాన్ రాష్ట్రంలో ఈ మారుమూల ప్రాంతం ఉంది. ఇక్కడ గతంలో అణుపరీక్ష జరిగిన చోట తిరిగి కార్యకలాపా లు మొదలయ్యాయని అమెరికా వార్తా పత్రిక న్యూయార్క్‌టైమ్స్ ప్రకటించింది. ఈ మేరకు పత్రిక విడుదల చేసిన చిత్రాలను చూస్తే అతి త్వరలోనే చైనా పూర్తిస్థాయిలో అణు పరీక్షలు నిర్వహించే అవకాశం ఉందని అర్థమవుతోంది. కనీసం నియంత్రిత పద్ధతిలో సబ్ క్రిటికల్ అణు పరీక్షలు అయినా చేసే అవకాశం కూడా ఉంది.



# మహారాష్ట్రపై కేసీఆర్ గంపెడాశలు

## 30న కొల్హాపూర్‌లో సభ

## 48 ఎంపీ స్థానాల్లో పోటీ!

హైదరాబాద్: జాతీయస్థాయిలో పార్టీ కార్యకలాపాల విస్తరణ ప్రణాళికలు కొనసాగించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. అందులో భాగంగానే వచ్చే ఏడాది జరిగే పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి సారించింది. తెలంగాణతోపాటు పొరుగునే ఉన్న మహారాష్ట్రలోని 48 స్థానాల్లోనూ బరిలో దిగేందుకు సిద్ధమైంది. మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఉనికి చాటిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల లక్ష్యంగా కార్యకలాపాలు వేగవంతం చేయాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదేశించారు. తుంటి ఎముక శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటున్న ఆయన త్వరలోనే మహారాష్ట్ర బీఆర్ఎస్ కీలక నేతలతో భేటీ కానున్నారు. మహారాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ కల్వకుంట్ల వంశీధర్‌రావు నిరంతరం అక్కడి నేతలతో సమన్వయం చేస్తూ స్థానికంగా సభలు, సమావేశాలు కొనసాగేలా చూస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఫలితాల తర్వాత లాతూరులో పదివేల మందితో సభ నిర్వహించిన బీఆర్ఎస్, ఈ నెల 30న కొల్హాపూర్‌లోనూ బహిరంగసభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. తర్వాత షోలాపూర్, ఔ రంగాబాద్, వార్ధా, బీడ్‌లోనూ సభలు ఉంటాయని మహారాష్ట్ర బీఆర్ఎస్ నేతలు వెల్లడించారు.

**క్షేత్ర స్థాయిలో చురుగ్గా కమిటీలు...** డిసెంబర్ మొదటివారంలో మహారాష్ట్రలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో 200కు పైగా సర్పంచ్, వార్డు సభ్యుల పదవులను బీఆర్ఎస్ అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. నాగపూర్, ఔరంగాబాద్ (శంభాజీనగర్), వార్ధా, బీడ్, సతారా, కొల్హాపూర్, సాంగ్లి, షోలాపూర్ తదితర జిల్లాల్లో పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. ఈ ఏడాది జూన్‌లో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టగా, మహారాష్ట్ర వ్యాప్తంగా 20లక్షలకు పైగా మంది క్రియాశీల సభ్యులుగా నమోద య్యారు.

సంస్థాగతంగా 48 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోనూ పార్టీ ప్రధాన, అనుబంధ కమిటీల ఏర్పాటు పూర్తయ్యింది. ఇప్పటికే నాగపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభించి కార్యకలాపాలు సాగుతుండగా, త్వరలో పుణే, ఔరంగాబాద్‌లోనూ పార్టీ సొంత కార్యాలయాలు ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. తెలంగాణకు సరిహద్దుగా ఉన్న విదర్భ, మరాఠ్వాడా ప్రాంతంలో బీఆర్ఎస్ పట్ల ఆదరణ పెరిగిందని పార్టీ అంచనా వేస్తోంది.

**తెలంగాణ ఓటమితో సానుభూతి...** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత మహారాష్ట్రలో బీఆర్ఎస్ పట్ల సానుభూతి పెరిగిందని మహారాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు మాణిక్ కదమ్ వెల్లడిం చారు. 'వ్యవసాయానికి ఉచిత విద్యుత్, రైతుబంధుతో పాటు కల్యాణ లక్ష్మి వంటి పథకాలు అమలు చేసినా పార్టీ ఓడిపోవడంపై చర్చ జరుగుతోంది. ఆచరణ సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ గందరగోళాన్ని సృష్టించి అధి కారంలోకి వచ్చిందనే విషయాన్ని విడమరిచి చెబుతున్నాం. మహారాష్ట్రలో రైతు ఆత్మహత్యలకు బీఆర్ఎస్ అనుసరించే రైతు అనుకూల విధానాలతోనే పరిష్కారం దొరుకుతుందనే భావన కనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నందున బీఆర్ఎస్ సభలు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. కేసీఆర్ కోలుకున్న తర్వాత మహారాష్ట్ర పర్యటనకు వచ్చే అవకాశముంది'అని వెల్లడించారు.

# రబీ రంది తీరేదెలా?

## రైతుబంధుకు రైతుల ఎదురుచూపు




హైదరాబాద్: రైతు బంధు కోసం రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఇప్పటివరకు ఎకరంలోపు భూమి ఉన్న రైతుల బ్యాంకు ఖాతాల్లోనే రైతుబంధు సొమ్ము జమ అయ్యింది. 9.44 లక్షల ఎకరాల్లో రైతులు ఇప్పటికే యాసంగి పంటలు సాగు చేశారు. అందులో 1.47 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడ్డాయి. మరో 38 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేసేందుకు పనులు జరుగుతున్నాయి. దీంతో రైతులకు పెట్టుబడి ఖర్చులకు డబ్బులు అవసరమవుతాయి. ఈ కీలకమైన సమయంలో సొమ్ము పడకపోతే ప్రైవేట్ అప్పులే శరణ్యమని రైతుల ఆందోళన చెందుతున్నారు. ఈనెల 12 నుంచి రైతుబంధు ప్రక్రియ ప్రారంభం కాగా, ఎకరాలోపు భూమి ఉన్న రైతుల్లో.. అది కూడా కొందరికే సొమ్ము పడింది.

వాస్తవంగా రోజుకో ఎకరా చొప్పున మొదటి రోజు ఎకరా వరకు, రెండో రోజు రెండెకరాలు... ఇలా రోజుకు ఎకరం చొప్పున గతంలో ఇచ్చేవారు. అలాగే ఇస్తామని అధికారులు కూడా చెప్పారు. కానీ ఎకరాకు మించి భూమి ఉన్న వారికి పెట్టుబడి సాయం అందలేదని రైతులు అంటున్నారు.

**మొత్తం రైతుబంధు లబ్దిదారులు 68.99 లక్షలు:** అధికారంలోకి రాగానే రైతుబంధు సొమ్ము అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించింది. ఆ ప్రకారం రైతుబంధు సొమ్ము జమ ప్రక్రియ ప్రారంభమైంది. అది ఎకరాలోపు కొందరికి మాత్రమే ఇచ్చి నిలిచిపోయింది. మిగిలిన వారికి సొమ్ము పడలేదు. మొత్తం రైతుబంధు లబ్దిదారులు 68.99 లక్షలున్నారు. వారందరికీ కలిపి రూ.7,625 కోట్లు చెల్లించాలి. ఎకరాలోపు ఉన్న రైతులు 22.55 లక్షల మంది ఉన్నారు. వారికి రూ. 642.57 కోట్లు చెల్లించాలి. ఇప్పటివరకు ఎకరాలోపున్న వారి లో సగం మందికే రైతుబంధు వచ్చింది. మొత్తంగా చూస్తే రైతుబంధు కోసం ఇంకా దాదాపు 58 లక్షల మంది రైతులు ఎదురుచూస్తున్నారని వ్యవసాయవర్గాలు అంచనా వేస్తున్నాయి. నిధులు లేకపోవడం వల్లే రైతుబంధు ఆలస్యమవుతుందని అధికారులు అంటున్నారు. ఈ నెలాఖరుకైనా ఇస్తారా లేదా అన్న చర్చ జరుగుతోంది.

ఇదిలాఉంటే రైతులకు బ్యాంకులు రుణాలు కూడా ఇవ్వడం లేదు. గత పంటల రుణమాఫీ పూర్తికాకపోవడం, ఇంకా పెండింగ్‌లో ఉండటంతో బ్యాంకులు కొత్త రుణాలు ఇవ్వడం లేదని చెబుతున్నారు.

**కొత్త రుణమాఫీపై కసరత్తు...** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఒకేసారి రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో రైతులు కూడా దానికోసం ఎదురుచూస్తున్నారు. దీనిపై మార్గదర్శకాలు ఖరారు చేయాలని ప్రభుత్వం వ్యవసాయశాఖకు విన్నవించినట్టు తెలిసింది. గత రుణమాఫీ మార్గదర్శకాల ప్రకారమే నడుచుకుంటారా? లేక కొత్తగా అదనపు నిబంధనలతో ఏమైనా మార్పులు చేర్పులు చేస్తారా అనేది తేలాల్సి ఉంది.




## నీటిపారుదల శాఖలో విచిత్ర పరిస్థితి..?

రాష్ట్ర నీటిపారుదల శాఖలో విచిత్ర పరిస్థితి నెలకొంది. శాఖకు కార్యదర్శి ఉన్నారా? లేరా? అన్న స్పష్టత కరవైంది. రజత్ కుమార్ పదవీ విరమణ తర్వాత స్మితాసభర్వాల్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే ముఖ్యమంత్రి, నీటిపారుదలశాఖ మంత్రి సమీక్షలకు స్మితాసభర్వాల్‌కు హాజరు కావడం లేదు. దస్త్రాలు కూడా చూడడం లేదని శాఖ వర్గాలు చెప్తున్నాయి.

# 'మహాలక్ష్మి'తో ఆర్టీసీకి తిప్పలు




## పెరిగిన రద్దీతో నిత్యం వివాదాలే!

హైదరాబాద్: 'మహాలక్ష్మి పథకం' ఇప్పుడు ఆర్టీసీకి పెద్ద సవాలుగా మారింది. ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం నుంచి ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సుల్లో తెలంగాణ మహిళలకు ఉచిత ప్రయాణ వసతి కల్పించిన విషయం తెలిసిందే. దీంతో ఆర్టీసీ బస్సులో ప్రయాణించే మహిళల సంఖ్య భారీగా పెరిగింది. తాజా లెక్కల ప్రకారం.. 'మహాలక్ష్మి'తర్వాత బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళల సంఖ్య దాదాపు 13 లక్షల మేర పెరిగింది. గతంలో 66 శాతంగా ఉన్న ఆర్టీసీ బస్సుల ఆక్యుపెన్సీ రేషియో ఇప్పుడు 90 శాతానికి చేరుకుంది. కొన్ని మార్గాల్లో అది వందశాతం కూడా దాటింది. అంటే సీట్ల సామర్థ్యం కంటే ఎక్కువ మంది బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. మహిళా ప్రయాణీకులు 70 శాతం సీట్లలో కూర్చుంటున్నారు. దీంతో మిగతా మహిళలు, పురుషులు నిలబడే ప్రయాణించాల్సి రావడం వివాదాలకు కారణమవుతోంది.

**బస్సులు సరిపోక...** పెరిగిన రద్దీని క్రమబద్ధికరించాలంటే బస్సుల సంఖ్య భారీగా పెంచాలి. ప్రస్తుతం సాధారణ రోజుల్లో ఆర్టీసీ బస్సుల్లో సగటున 41 లక్షల మంది, రద్దీ ఎక్కువగా ఉండే సోమవారాల్లో 51 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఆక్యుపెన్సీ రేషియో 90 శాతంగా ఉంటోంది. మహిళలకు ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం ఉంది. ఈ కేటగిరీ బస్సులు ప్రస్తుతం ఆర్టీసీలో 7292 బస్సులు మాత్రమే ఉన్నాయి. నిజానికి ఆర్టీసీ డిపోల్లో ఉన్న అన్ని బస్సులు రోజూ రోడ్డెక్కవు. వాటిల్లో కొన్ని బ్రేక్‌డౌన్‌లో ఉంటాయి. కొన్ని ఇతర అవసరాల కోసం స్పేర్‌లో ఉంటాయి. సాధారణ రోజుల్లోనే బస్సులు సరిపోక ట్రిప్పులకు ఇబ్బంది అవుతూ వస్తున్న తరుణంలో, మహిళలకు ఉచిత ప్రయాణ వసతి అమలులోకి రావటంతో బస్సులకు ఒక్కసారిగా తీవ్ర కొరత ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో వంద శాతాన్ని మించి ఆక్యుపెన్సీ రేషియో నమోదవుతుండటంతో అదనపు ట్రిప్పు నడపాల్సి వస్తోంది. కానీ బస్సులు అందుబాటులో లేక సర్దుబాటు చేయలేకపోతున్నారు. ఫలితంగా, ప్రుయాణికులతో కిక్కిరిసి నడపాల్సి వస్తోంది. స్థలం సరిపోక కొందరు ప్రయాణికులు దిగిపోవాల్సి వస్తోంది. దీంతో అదనపు బస్సు నడపాలంటూ వారు సిబ్బందితో ఘర్షణ పడుతున్నారు.

**ఇప్పటికిప్పుడు 4 వేల బస్సులు కావాల్సిందే..** ప్రస్తుత రద్దీని తట్టుకునేందుకు ఆర్టీసీ ఇప్పటికిప్పుడు దాదాపు 4 వేల వరకు కొత్త బస్సులు సమకూర్చుకోవాల్సి ఉంది. గతంలోనే ఆర్టీసీ రెండు వేల బస్సులకు ఆర్డరిచ్చింది. వాటిల్లో ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు 1,500 వరకు ఉంటాయి. కానీ ఆ బస్సులు అందుబాటులోకి రావాలంటే ఇంకా నాలుగు నెలల సమయం పడుతుంది. వచ్చే మార్చి చివరి నాటికి అవి దశలవారీగా అందుబాటులోకి వస్తాయి. మరో 20 రోజుల్లో 50 బస్సులు అందనున్నాయి. కానీ అప్పటి వరకు ఈ రద్దీని తట్టుకునే పరిస్థితి లేదు. రోజురోజుకు ప్రయాణికులు-ఆర్టీసీ సిబ్బంది మధ్య వివాదాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో పెరిగిందని సంతోషపడుతున్నా.. రోజూ నిలబడి ప్రయాణించటం ఇబ్బందిగా భావించేవారు మళ్లీ ఆటోల వైపు మళుతారు. దీంతో పెరిగిన ఆక్యుపెన్సీ రేషియో కొంత పడిపోతుంది. ఇది జరగకుండా ఉండాలంటే నాలుగు వేల బస్సులు కావాలి. కానీ, అన్ని బస్సులు సమకూర్చుకోవటానికి ఆర్టీసీ వద్ద నిధులు లేవు. ఇప్పటి వరకు ప్రభుత్వం కొత్త బస్సుల అంశాన్ని ప్రస్తావించలేదు.

**ఎలక్ట్రిక్ బస్సులు లాగుతాయా..** త్వరలో వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ సమకూర్చుకోనుంది. వాటిలో 500 బస్సులు సిటీ సర్వీసులుగా తిరుగుతాయి. నగరంలో ఓఆర్ 90 శాతాన్ని దాటింది.

అంత లోడ్‌ను ఎలక్ట్రిక్ బస్సులు లాగుతాయా అన్న సందేహం అధికారుల్లో వ్యక్తమవుతోంది. లాగినా, బ్యాటరీలు ముందుగానే డిస్చార్జి అవుతాయని ఆందోళన చెందుతున్నారు.

**మళ్లీ అద్దె బస్సుల నోటిఫికేషన్...** సమస్య నుంచి గట్టెక్కాలంటే వెంటనే కొత్త బస్సులు సమకూర్చుకోవాల్సి ఉన్నందున, ఆర్టీసీ అధికారులు మరోసారి అద్దె ప్రాతిపదికన ప్రైవేటు వ్యక్తుల నుంచి బస్సులు సమకూర్చుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు అద్దె బస్సులు కావాలంటూ నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే, ప్రస్తుతం రద్దీ విపరీతంగా పెరిగినందున, పాత అద్దె రేట్లకు బస్సులు పెట్టేందుకు ప్రైవేటు వ్యక్తులు సుముఖంగా లేరు. అద్దె చార్జీలు సవరించాలని కోరుతున్నారు. సవరిస్తే ఆర్టీసీపై ఆర్థిక భారం పడుతుంది.

**వారంలో 50 కొత్త బస్సులు: ఎండీ సజ్జనార్ -** కొత్తగా వచ్చే బస్సుల నమూనాను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పరిశీలించారు. వాటిల్లో లహరి స్లీపర్ కమ్ సీటర్, రాజధాని, ఎక్స్‌ప్రెస్ బస్సులున్నాయి. సంక్రాంతి నాటికి 200 బస్సులు రోడ్డెక్కుతాయని, వీటిలో 50 బస్సులు వారం రోజుల్లో అందుతాయని సజ్జనార్ వెల్లడించారు. నాలుగైదు నెలల్లో విడతలవారీగా 400 ఎక్స్‌ప్రెస్, 512 పల్లెవెలుగు, 92 లహరి స్లీపర్ కమ్ సీటర్, 56 రాజధాని, 540 ఎలక్ట్రిక్ సిటీ బస్సులు, నగరం వెలుపల తిరిగేందుకు 500 ఎలక్ట్రిక్ బస్సులు అందుతాయని వెల్లడించారు.

# సంపాదకీయం

## మోడీ ని ఢీకొట్టే 'మొనగాడి' కోసం ఇండియా కూటమి!

టార్గెట్ మోడీ.. ఇదే ఇప్పుడు కాంగ్రెస్ నేతృత్వంలోని 18 పార్టీల ఇండియా కూటమి ప్రధాన లక్ష్యం. మోడీని గద్దె దింపడం మాత్రమే కాదు.. ఆయనను కూడా చిత్తుగా ఓడించాలనేది ఇండియా కూటమి ఇప్పుడు లక్షించుకున్న ప్రధాన విధానం. దీనికి సంబంధించి పావులను కూడా వేగంగా కదుపుతుండడం గమనార్హం. తాజాగా జరిగిన సమావేశంలో ఈ విషయంపైనే చర్చ జరిగింది. ప్రస్తుతం ప్రధాని మోడీ.. టెంపుల్ టౌన్‌గా ప్రసిద్ధి చెందిన యూపీలోని వారణాసి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2014, 2019 పార్లమెంటు ఎన్నికల్లో ఆయన విజయం దక్కించుకున్నారు. అయితే.. వచ్చే ఎన్నికల్లో ఇక్కడే.. ఇదే నియోజకవర్గంలోనే మోడీని మట్టి కరిపించాలన్నది ఇండియా కూటమి పార్టీల లక్ష్యంగా ఉంది. ఈ నేపథ్యంలో ఆయనపై పోటీ చేసేందుకు బలమైన నాయకులను రంగంలోకి దింపాలని నిర్ణయించారు. వారణాసి నుంచి మోడీ1పై ఎవరు పోటీలోకి దిగాతారనే విషయంలో రెండు పేర్లు పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది. మోడీని ఢీ అంటే ఢీ అంటున్న బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ చీఫ్ నితీష్ కుమార్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ పేర్లు తెరపైకి వచ్చాయి. వీరు ఔనంటే సరే.. లేదా ఎన్నికల సమయానికి వీరి గ్రాఫ్‌ను బట్టి.. వీరిలో ఒకరిని ఎంచుకుంటారు. ఒకవేళ ఇద్దరూ కాదంటే.. ఢిల్లీ సీఎం ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ పేరును కూడా పరిశీలిస్తున్నారు.

**బీజేపీకి కంచుకోట! :** వారణాసి పార్లమెంటు నియోజకవర్గం బీజేపీకి కుంచుకోట. 1991 నుంచి ప్రతి ఎన్నికలోనూ (2004లో మినహా) బీజేపీ ఇక్కడ గెలుస్తోంది. ఇక్కడ నుంచి 60 శాతానికి పైగా ఓట్లను గత రెండు ఎన్నికల్లోనూ మోడీ సొంతం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి మోడీపై గట్టి అభ్యర్థిని దింపడం ద్వారా టెంపుల్ టౌన్‌పై పట్టుసాధించాలని ఇండియా కూటమి భావిస్తోంది. మరోవైపు.. బీజేపీ తన పట్టును మరింత పెంచుకునేందుకు.. వారణాసిని అద్భుత సుందర దివ్యధామ నగరంగా తీర్చిదిద్దుతున్న విషయం తెలిసిందే.

# ముగిసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది

### ఢిల్లీ బయల్దేరి వెళ్ళిన రాష్ట్రపతి.

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వీడ్కోలు పలికిన గవర్నర్ తమిళిసై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, త్రివిధ దళ, రాష్ట్ర అత్యున్నత అధికారులుతోపాటుగా జిల్లా కలెక్టర్ గౌతమ్





జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజిగిరి (గరుడ వార్త) : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది విజయవంతంగా ముగించుకొని డిల్లి వెళ్లారు. ఈనెల 18న హైదరాబాద్ నగరానికి శీతాకాల విడిదిలో బాగంగా భారత వాయుసేన ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకోవడంతో మొదలైన ఆమె పర్యటన, శనివారంతో ముగించుకొని ఢిల్లీ వెళ్లారు. శనివారం ఉదయం మేడ్చల్ – మల్కాజిగిరి పరిధిలోని హకీంపేట ఎయిర్ ఫోర్సు స్టేషన్ చేరుకొని, అక్కడ భారత వాయుసేన ప్రత్యేక విమానంలో దేశ రాజధాని ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. రాష్ట్రపతి పర్యటన ముగియడంతో ఆమెకు వీడ్కోలు పలికేందుకు హకీంపేట విమానాశ్రయానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, డీజీపీ రవిగుప్తా, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, జిల్లా కలెక్టర్ గౌతమ్, త్రివిధ దళాల ఉన్నతాధి అధికారులు తదితరులు హాజరయ్యారు.

# అన్నదాతకు నాణ్యమైన విత్తనాలందించే భారతీయ విత్తన పరిశ్రమలను సంఘటితం చేయడమే లక్ష్యంగా గుబ్బ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్

### గుబ్బ కోల్డ్ స్టోరేజ్ సిజిఓ గుబ్బదీప్తి
### ఉన్నతమైన లక్ష్యంతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం హర్షనియం
### హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సీఈవో సునీల్ కాంటే







జిల్లా బ్యూరో మేడ్చల్ %--% మల్కాజిగిరి (గరుడ వార్త) : అన్నదాతకు అండగా నిలిచే భారతీయ విత్తనాల పరిశ్రమలను సంఘటితం చేయడంలో భాగంగా గుబ్బ కోల్డ్ స్టోరేజ్ సంస్థ ఏర్పాటు చేసిన ఆరవ గుబ్బ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఆహ్లాదకరంగా, అంగరంగ వైభవంగా ముగిసింది. తూముకుంట మున్సిపాలిటీ పరిధి మందాయపల్లిలోని బిసిసిఐ నుండి ఆమోదం పొందిన నెక్స్ జెన్ క్రికెట్ మైదానం ఈ టోర్నమెంట్ కు వేదికయింది. దేశంలోని నలుమూలల నుండి పది జట్లు పాల్గొనగా, వీరి మధ్య ఆరు రోజులపాటు పోరు కొనసాగింది. శనివారం చతిస్గడ్ రాయపూర్ కు చెందిన వి ఎన్ ఆర్ సీడ్స్ కంపెనీ జట్టు గుబ్బ ప్రీమియర్ లీగ్ కప్పు కైవసం చేసుకొని, విజేతగా నిలుస్తూ టోర్నమెంట్ కు ముగింపు పలికింది. గుబ్బ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ వీక్షించేందుకు ముఖ్యఅతిథిగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సీఈవో సునీల్ కాంటే విచ్చేసి, టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. టస్కర్స్, త్రీలోకియా సౌజన్యంతో టోర్నమెంట్ నిర్వహించారు. ఇక టోర్నమెంట్ నిర్వాహక సంస్థ గుబ్బ కోల్డ్ స్టోరేజ్ సిజిఓ గుబ్బదీప్తి మాట్లాడుతూ.. గత 36 సంవత్సరాలుగా విత్తనోత్పత్తిదారులకు సేవలు అందిస్తున్న తమ సంస్థ అన్నదాతకు నాణ్యమైన విత్తనాల అందిస్తున్న పరిశ్రమలను సంఘటితం చేయాలని లక్ష్యంతో తాము, గుబ్బ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ కు శ్రీకారం చుట్టినట్లుగా ఆమె తెలిపారు. అప్పటినుండి కరోనా విజృంభించిన సంవత్సరాలు మినహా తమ సంస్థ ప్రతి సంవత్సరం క్రికెట్ టోర్నమెంట్ ని నిర్వహిస్తూ దేశం నలుమూలలకు చెందిన విత్తన పరిశ్రమల జట్లతో గుబ్బ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. టోర్నమెంట్లో పాల్గొనే క్రీడాకారులు మూడు నెలల ముందు నుండి క్రికెట్ సాధన చేసి మరి క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొంటారని గుబ్బ దీప్తి తెలిపారు. అందులో భాగంగానే ఈసారి విజేతగా ఛత్తీస్గడ్ రాయపూర్ కు చెందిన వి ఎన్ ఆర్ సీడ్స్ కంపెనీ జట్టు నిలిచిందన్నారు. టోర్నమెంట్ వీక్షించేందుకు వందలాదిమంది హాజరయ్యారు. ఇక టోర్నమెంట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫాస్ట్ ఫుడ్స్ ఆహుతులను, జట్టు సభ్యులను అద్భుతమైన రుచులతో అలరించాగా, మరోవైపు ఇరు జట్ల మద్య జర్గిన క్రికెట్ మ్యాచ్ మరింత రసవతరంగ సాగింది. ఉన్నతమైన లక్ష్యంతో ఏర్పాటు చేసిన గుబ్బ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పై హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సీఈవో సునీల్ కాంటేతోపాటుగా వీక్షకుల నుండి ప్రశంసలు అందుతున్నాయి.

# రెవెన్యూ వ్యవస్థ బాగుంటేనే ప్రభుత్వం బాగుంటుంది




శామీర్ పేట (గరుడ వార్త) : మేడ్చల్ జిల్లా తుంకుంట మున్సిపాలిటీ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో శనివారం ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సేవల అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ కోదండరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భూముల విలువ అమాంతం పెరగడంతో అడిగేవారు ఉండొద్దని గత ప్రభుత్వం వి ఆర్ ఓ, వి ఆర్ ఏ వ్యవస్థను రద్దు చేసి ఇష్టమొచ్చినట్లు రికార్డులు మార్చుకున్నారని ఆరోపించారు. అధికారులు ఏమి చేసినా నిజాం కాలం నుంచి ప్రజలు బరిస్తున్నారని మౌనంగా ప్రజాస్వామ్యంలో ప్రజలందరూ సమిష్టి గా రాజ్యాంగ బద్దంగా ఏర్పర్చుకున్న ప్రభుత్వం లో ప్రజలు సంతోషంగా ఉంటారు. రెవెన్యూ రికార్డు కరెక్ట్ గా ఉంటే మీ జీవితాలు సంతోషంగా ఉంటాయన్నారు. మౌనంగా ఉంటే మూర్ఖపు పాలనకు కారణం ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు రాజ్యాంగం ప్రకారం చట్టానికి లోబడి పనిచేయాలని సూచించారు. వి ఆర్ ఏ, వి ఆర్ ఓ ల జీవితం బాగుచేద్దామని ఈ సమావేశానికి వచ్చానని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులకు తోడ్పాటు అందిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ శాఖను పటిష్టం చేసిన పార్టీ ప్రభుత్వములోకి రావడం సంతోషాదయకమని సీఎం రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. 1984 వరకు రెవెన్యూ రికార్డులు పక్కాగా ఉండేవి. ఎన్టీఆర్ వచ్చాక పటేల్, పట్వారీ వ్యవస్థ తీసేశాక రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తమయ్యింది. నేదురుమల్లి హయాంలో గాడిన పడ్డ రెవెన్యూ రికార్డులు, మళ్ళీ టీడీపీ వచ్చి వి ఆర్ ఓ వ్యవస్థ తీసేస్తే వై ఎస్ హయాంలో వి ఆర్ ఓ వ్యవస్థను పునరుద్ధరించారని కేసీఆర్ సీఎం అయ్యాక తన స్వార్ధంతో రేవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించారన్నారు. గ్రామ పరిపాలన, రెవెన్యూ పాలన బాగుండాలంటే వి ఆర్ ఓ, వి ఆర్ ఏ వ్యవస్థ ఉండాలని రెవెన్యూ వ్యవస్థ ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ట్రెసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ... రెవెన్యూ ఉద్యోగులకు ట్రెసా అండగా ఉంటుందని అన్నారు. అనంతరం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గౌతమ్ కుమార్, మేడ్చల్ జిల్లా డిప్యూటీ కలెక్టర్ ఏనుగు నర్సింహా రెడ్డి, ధరణి నర్సింహా రెడ్డి, రాజ్ కుమార్, నాగం రెడ్డి, శైలజ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రెడ్డి, వివిధ జిల్లాల ట్రెసా అధ్యక్షులు, కార్యదర్శిలు, సభ్యులు పాల్గొన్నారు.

# సెయింట్ మేరీస్ సెంట్రల్ పాఠశాలలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు




శామీర్ పేట (గరుడ వార్త) : మండలంలోని తుర్కపల్లి పరిధిలోని సెయింట్ మేరీస్ సెంట్రల్ స్కూల్లో క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో విద్యార్థులు అందరూ పాల్గొని ఎంతో ఆనందంగా, ఆహ్లాదకరంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. ఈ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న పాఠశాల కరస్పాండెంట్ ఎల్లు వరప్రసాద్ రెడ్డి,ఇంచార్జి సౌజన్య, గ్రేస్, పాఠశాల అధ్యాపక బృందం పాల్గొని ఆనందంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు.

# వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనంతో పరవశించిన భక్తులు

శామీర్ పేట (గరుడ వార్త) : ధనురాశిలో సూర్యుడు సంచరించే మాసమైన ధనుర్మాసంలో వచ్చే శుక్లపక్ష ఏకాదశిని వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి ఏకాదశిగా వ్యవహరిస్తూ ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకోవడం ఎంతో ప్రాముఖ్యంగా ధర్మశాస్త్రాలలో చెప్పడంతో భక్తులు అధిక సంఖ్యలో వైకుంఠ ఏకాదశి రోజున స్వామివారిని దర్శించుకుంటారని ఆలయ పురోహితులు తెలిపారు. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకుగాను శనివారం తూంకుంట మునిసిపాలిటి, శామిరపేట, మూడుచింతలపల్లి మండలాల పరిదిలోని వివిధ




ఆలయాలతోపాటుగా అలియాబాద్ లోని రత్నాలయం, ఉద్దమర్రిలోని విష్ణు దేవాలయంలో శనివారం రోజున ప్రత్యేకంగా ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుండే వందలాదిగా భక్తులు ఆలయాలకు చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో దర్శనం కొరకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకుగాను ప్రత్యేకమైన క్యూలైన్లను ఆలయ సిబ్బంది ఏర్పాటు చేశారు. ఇక షామీర్పేట పోలీసులు భక్తులకు అదేవిధంగా రహదారులపై రాకపోకలు సాగించే వారికి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకుగాను, శనివారం తెల్లవారుజాము నుండే అలియాబాద్ ఆలయాల వద్ద విధుల్లో ఉండడంతో భక్తులకు స్వామివారి దర్శనం సజావుగా సాగింది.

# కదలని దస్త్రాలు..!

వరంగల్ : గ్రేటర్ వరంగల్‌కు పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. పౌరసేవల్లో జాప్యం జరుగుతోంది. సిటిజన్ ఛార్టర్ నిబంధనలు అమలు చేయడం లేదు. కాశీబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాల్లో వందల సంఖ్యలో దస్త్రాలు పేరుకుపోయాయి. వింగ్ అధికారులు, ఉద్యోగుల పనితీరుపై తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అడిగే వారు లేరని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల తరుపున ప్రశ్నించాల్సిన బల్దియా పాలకవర్గం మౌనంగా ఉంటుంది. కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయంలో ఓ ఉన్నతాధికారి తీరుతో ప్రజలు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టీఎస్–బీపాస్ భవన నిర్మాణ అనుమతులు, కొత్త ఇంటి నంబర్లు, ఆస్తి పేరు మార్పిడి తదితర 60 నుంచి 70 దస్త్రాలు తొక్కి పెట్టినట్లుగా తెలిసింది. కొన్ని అర్జీలు కారణాలు చెప్పకుండానే తిరస్కరిస్తున్నారని, అధికారి పనితీరుపై ఫిర్యాదులు కూడా వచ్చాయి. కిందిస్థాయి ఉద్యోగులకు ఆదర్శంగా ఉండాల్సిన అధికారే ఇందుకు విరుద్ధంగా పనిచేయడం విమర్శలకు తావిస్తోంది. ఇటీవల కొందరు కార్పొరేటర్లు ఇన్‌ఛార్జి కమిషనర్ ప్రావీణ్యను కలిసి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఉదాహరణలు.. కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయంలో టీఎస్–




బీపాస్ భవన నిర్మాణ అనుమతి ఫైనల్ వెరిఫికేషన్ ఫైల్‌పై సంతకం చేయాలంటే రూ. 1000 ఇవ్వాల్సిందే. అందరికి ఇస్తారు, నాకెందుకు ఇవ్వరని ఉన్నతాధికారి బహిరంగంగానే డబ్బులు అడుగుతున్నారని తెలిసింది. ఆరెపల్లి విలీన గ్రామంలో ఇద్దరు వ్యక్తులు కొత్త ఇంటి నంబరుకు దరఖాస్తు చేశారు. ఆర్ఐ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఉన్నతాధికారి వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ధర్మారం, గొర్రెకుంట, వసంతాపూర్, బొల్లికుంట, కీర్తినగర్‌కు సంబంధించిన పన్నుల విభాగంలో ఆస్తిపేరు మార్పిడి దస్త్రాలు నెలల తరబడి పెండింగ్‌లో పెట్టారు. అడిగితే వెబ్‌సైటులో సాంకేతిక లోపమని చెబుతున్నారు. తిమ్మాపూర్ విలీన గ్రామంలో ఓ సర్వేనంబరు స్థలంలో ఇప్పటికే ఐదు భవన నిర్మాణ అనుమతులు ఇచ్చారు. ఆరో దరఖాస్తును ఆపేశారు. లింకు డాక్యుమెంటు సరిగా లేదని కొర్రీలు పెట్టినట్లు సమాచారం. దేశాయిపేట, లేబర్ కాలనీ, రంగశాయిపేట, కరీమాబాద్, గిర్మాజిపేట ప్రాంతాలకు చెందిన టీఎస్–బీపాస్ ద్వారా వచ్చిన ఫైనల్ వెరిఫికేషన్ పేరుతో ఆరు దస్త్రాలు ఆపేశారని తెలిసింది.

# భూగర్భ జలం.. సాగుకు బలం

ఎల్లారెడ్డిపేట : జిల్లాలో భూగర్భజల మట్టాలు నిలకడగా కొనసాగుతున్నాయి. నెల రోజుల వ్యవధిలో స్వల్పంగా తగ్గుదల ఉన్నప్పటికీ ఆశాజనకంగా ఉన్నాయి. సమృద్ధిగా లభిస్తున్న నీరు సాగుకు బలాన్ని చేకూర్చుతుండగా భూగర్భ జలాలు ఈ యాసంగి సీజన్‌లో పంటకు జీవం పోయనున్నాయి.జిల్లాలో వ్యవసాయానికి బోర్లు, బావులు ప్రధాన జీవనాధారంగా నిలుస్తున్నాయి. సాధారణంగా వర్షాకాలం ప్రారంభం నుంచి నవంబరు వరకు భూగర్భజల మట్టాలు వేగంగా పెరుగుతుండగా అందుకు అనుగుణంగానే బోర్లు, బావులు వెంటనే రీఛార్జి అవుతుంటాయి. ఏటా నవంబరు నుంచి ఏప్రిల్‌లోపు భూగర్భ జలాలు పాతాళానికి చేరుకోవడం జిల్లాలో పరిపాటి అయినప్పటికీ ఈ ఏడాది అక్టోబరు నుంచి నవంబరు వరకు నెల రోజుల్లో తరుగుదలలో పెద్దగా తేడా కనిపించక పోవడం గమనార్హం. భూగర్భ జల మట్టాల్లో నెలకొన్న నిలకడ పరిస్థితులతో యాసంగికి ఢోకా లేదని అన్నదాతలు చెబుతున్నారు.

ఊపందుకుంటున్న పంటల సాగు

జిల్లాలో నీటి వనరులు నిండుకుండలను తలపిస్తున్నాయి. చెరువులు, కుంటల్లో జలకళ ఉట్టిపడుతుండగా తక్కువ లోతులోనే భూగర్భ జలాలు లభ్యమవుతున్నాయి. నవంబరులో జిల్లా సగటు భూగర్భజల మట్టాలు



4.91 మీటర్లలో ఉన్నాయి. ఈ సంవత్సరం మేతో పోల్చితే 3.42 మీటర్ల మేర వృద్ధి చెందగా గతేడాది నవంబరుతో పోలిస్తే 1.24 మీటర్ల మేర పడిపోయాయి. అలాగే ఈ ఏడాది అక్టోబరు నుంచి నవంబరు వరకు నెల రోజుల వ్యవధిలో కేవలం 0.13 మీటర్లకు భూగర్భజల మట్టాలు తగ్గిపోయాయి. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ అక్టోబరు నుంచి నవంబరు వరకు భూగర్భజల మట్టాల్లో స్వల్ప తగ్గుదల మాత్రమే కనిపిస్తోంది. తంగళ్లపల్లి మండలంలో అత్యల్ప లోతు 3.53 మీటర్లలో భూగర్భ జలాలు లభిస్తుండగా, వేములవాడ అర్బన్‌లో అత్యధిక లోతు 8.58 మీటర్లలో ఉన్నాయి. మొత్తంగా సాగు నీరు పుష్కలంగా లభిస్తుండటంతో ఈ యాసంగిలో పంటల సాగు ఊపందుకుంటోంది. జిల్లాలో మొత్తం 1,82,339.12 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలను సాగుకానున్నాయి. ఇందులో 1,75,335 ఎకరాల్లో వ్యవసాయ పంటలు, 6,317 ఎకరాల్లో ఉద్యానవన పంటలను సాగు చేస్తారని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు. వ్యవసాయ పంటల్లో 1,73,100 ఎకరాల్లో వరి, 1,014 ఎకరాల్లో మొక్కజొన్న, 65.12 ఎకరాల్లో వేరుసెనగ, 240 ఎకరాల్లో నువ్వులు, 303 ఎకరాల్లో పొద్దుతిరుగుడు, 392 ఎకరాల్లో శనగ వేయనున్నారు. ఉద్యానవన పంటల్లో 687 ఎకరాల్లో ఆయిల్‌పాం, 550 ఎకరాల్లో కూరగాయలు, 5,767 ఎకరాల్లో పండ్ల తోటలను పెంచనున్నారు.

# నత్తనడకన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం

ముస్తాబాద్ : మండలంలో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటికే గ్రామాల్లో సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. చిన్న చిన్న పనులు మిగిలిపోయాయి. త్వరగా పూర్తి చేసి అప్పగిస్తారని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. పనులు మాత్రం మందకొడిగా సాగుతుండటంతో ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముస్తాబాద్ మండలంలో ముస్తాబాద్, మోహినికుంట, మద్దికుంట, పోత్గల్, చిప్పలపల్లి గ్రామాల్లో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించారు. కొండాపూర్‌లో 40 ఇళ్ల నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. తలుపులు, కిటికీలు, ప్లంబింగ్, సెప్టిక్ ట్యాంకులు, పెయింటింగ్ పనులు చేయాల్సి ఉంది. గూడెం గ్రామానికి 50 మంజూరు కాగా, 48 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. చిన్న చిన్న పనులు మిగిలిపోయాయి. నెలలు తరబడినా పనులు పూర్తి చేయకపోవడంపై లబ్ధిదారుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు చొరవ చూపి పనులు త్వరగా పూర్తి చేసి అప్పగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఎప్పుడు ఇస్తారోనని..నేను దాదాపు పదేళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాను. మా గ్రామంలో రెండు పడక గదుల ఇళ్లు నిర్మించారు. గ్రామ



పంచాయతీ ద్వారా అర్హులను ఎంపిక చేశారు. పనులు పూర్తి కాగానే ఇళ్లు అప్పగిస్తామని చెప్పారు. ఎప్పుడు ఇస్తారా అని ఎదురుచూస్తున్నాను. నాలాంటి పేద వారికి పైసా ఖర్చు లేకుండా ఇళ్లు ఇవ్వడం సంతోషంగా ఉంది. పనులు పూర్తి చేసి త్వరగా అందించాలి.అల్వాల లక్ష్మయ్య, గూడెం

లబ్ధిదారులను ఎంపిక చేశాం

కొండాపూర్‌కు రెండు పడక గదుల ఇళ్లు 40 మంజూరయ్యాయి. నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయి. తలుపులు, కిటికీలు, ప్లంబింగ్, సెప్టిక్ ట్యాంకులు, పెయింటింగ్ పనులు మిగిలి ఉన్నాయి. ఇప్పటికే గ్రామ పంచాయతీ పాలకవర్గం సహకారంతో గ్రామ సభ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశాం. సదరు గుత్తేదారు పనులు పూర్తి చేయగానే లబ్ధిదారులకు అప్పగిస్తాం. లబ్ధిదారుల కల త్వరలో నెరవేరనున్నది.యరాటి లక్ష్మి, సర్పంచి, కొండాపూర్

పనుల పూర్తికి చర్యలు

కొండాపూర్, గూడెం గ్రామాల్లో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. కొండాపూర్ గ్రామంలో తలుపులు, కిటికీలు, ప్లంబింగ్, సెప్టిక్ ట్యాంకులు, పెయింటింగ్ పనులు మిగిలి ఉన్నాయి. గూడెంలో పెయింటింగ్ పనులను ప్రారంభించారు. త్వరగా పూర్తి చేయాలని సదరు గుత్తేదారుకు సూచించాం. పనులు పూర్తికాగానే పాలకవర్గానికి అప్పగిస్తాం.నరేందర్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

# స్మార్ట్‌సిటీలో నిర్లక్ష్య ధోరణి



కరీంనగర్ : 'స్మార్ట్‌సిటీలో భాగంగా కరీంనగర్ టవర్‌సర్కిల్ ప్రాంతాన్ని అమృత్‌సర్ తరహాలో తీర్చిదిద్దుతాం..' ఆరేళ్ల కిందట ప్రణాళికలు తయారు చేసిన సమయంలో అన్న మాటలివి.. ప్రస్తుతం అక్కడ జరిగిన అభివృద్ధి పనులు చూస్తే మరి దారుణంగా కనిపిస్తోంది. ఎక్కడ పడితే అక్కడ తవ్వి కుప్పపెట్టడం, టైల్స్ ఊడిపోవడం, రహదారి మరింత ఇరుకుగా మారి రాకపోకలకు ఇబ్బంది కలిగించేలా తయారైంది.కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ పరిధిలోని నగర నడిబొడ్డున ఉన్న టవర్‌సర్కిల్ ప్రాంత అభివృద్ధి కోసం రూ.26 కోట్లు కేటాయించారు. ఇందులో రహదారులు, డ్రైనేజీలు, ఫుట్‌పాత్, విద్యుత్తు దీపాలు, రాత్రిపూట ఆకర్షించేలా ప్రత్యేక లైటింగ్, టైల్స్ వేసి అందంగా మార్చాల్సి ఉంటుంది. ఇప్పటివరకు 70 శాతం పనులు పూర్తి కాగా మిగతా పనులు వదిలేశారు. పలు చోట్ల మురుగుకాల్వలు, విద్యుత్తు పనులు వంటివి అసంపూర్తిగా ఉన్నాయి.

ఊడిపోతున్న టైల్స్

నడకదారి కోసం వేసిన ఫుట్‌పాత్ టైల్స్ పలు చోట్ల పగిలిపోగా, మరికొన్ని చోట్ల ఊడిపోయి చిందరవందరగా మారాయి. విద్యుత్తు తీగల కోసం ఫుట్‌పాత్ టైల్స్ తవ్వారు. ఈ పనులు ముందుగా చేయకపోవడంతో మళ్లీ తవ్వుతుండటంతో ఆ ప్రాంతం అసహ్యంగా మారింది. రోడ్డు మాదిరిగా వేసిన బండరాళ్లు తేలి ప్రమాదకరంగా మారుతున్నాయి.

కొలిక్కిరాని పనులు

టవర్‌సర్కిల్ చుట్టూ నిత్యం రద్దీగా ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఇక్కడికే వస్తారు. అలాంటి ప్రాంతాన్ని వావ్ అనేలా మార్చాల్సి ఉండగా ఇవేం పనులంటూ ముక్కున వేలేసేకులా మారింది. అప్పటి అదనపు పాలనాధికారి గరిమా అగ్రవాల్‌ను ప్రత్యేకంగా నిత్యం పరిశీలించాలని అప్పటి కలెక్టర్ సూచించినా అప్పటి నుంచి ఇప్పటివరకు పనుల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదు. మూడున్నర సంవత్సరాలుగా కొలిక్కి రావడం లేదు.

రాత్రయితే చీకటే!

టవర్ ప్రాంతంలో నలు వైపులా ప్రత్యేకంగా వీధిదీపాలు బిగించగా ఆరు నెలల నుంచి వెలగడం లేదు. ఉన్న లైట్లు కింద పడిపోతున్నాయి. లైట్లు వంకరగా మారిన మరమ్మతులు చేసే వారు లేరు. లైట్లకు సంబంధించిన విద్యుత్తు తీగలు, ఫ్యూజులు బిగించాల్సి ఉండగా ఆ పనులు నత్తనడకన సాగుతున్నాయి. సాయంత్రం పూట దుకాణాల ముందు వేసుకున్న లైట్లతోనే వెలుతురు ఉంటుండగా, రాత్రి 10 గంటల నుంచి మొత్తం చీకటిగా ఉంటుంది. కనీసం ఆ వైపు పాత స్తంభాలకు నగరపాలిక లైట్లు కూడా లేవు. ఇప్పటికైనా అధికారులు సంబంధించి పనులు పూర్తి చేయడంతో పాటు చీకటి లేకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

నోటిసులు ఇచ్చి, జరిమానా విధించాం

డి.కిష్టప్ప, ఈఈ, కరీంనగర్ నగరపాలిక

టవర్‌సర్కిల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే గుత్తేదారుకు పలుమార్లు నోటీసులు ఇచ్చాం. రూ.లక్షల్లో జరిమానా విధించాం. అయినా వారిలో మార్పు రావడం లేదు. ఆ గుత్తేదారు ఏజెన్సీలు మార్చుతుండటంతో సమస్య మొదటికొస్తుంది. లైట్ల కోసం కేబుల్ వేశారు. పరికరాలు బిగించి, కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. త్వరగా పూర్తి చేసేలా ఆదేశాలిస్తాం.

# పలుచటి దుప్పట్లు.. వణుకుతున్న విద్యార్థులు



కరీంనగర్ :సంక్షేమ వసతి గృహాలంటే విద్యార్థులకు అన్నిరకాల వసతులు, రక్షణ ఉండాలి.. శీతాకాలంలో విద్యార్థులు చలికి తట్టుకునేలా, వ్యాధుల బారిన పడకుండా వేడి భోజనం, దుప్పట్లు, ఉన్ని దుస్తులు, వేడి నీటి స్నానాలు ఉండేలా చూడాలి. శీతల గాలులు గదుల్లోకి చొరబడకుండా తలుపులు, కిటికీలు సౌకర్యంగా ఉండాలి. కొన్ని రోజులుగా చలి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వసతి గృహాలను బృందం పరిశీలించింది. చాలా వసతి గృహాల్లో దుప్పట్లు చలిని తట్టుకునేలా కనిపించలేదు. పాత భవనాల్లో కిటికీలు, తలుపులు మరమ్మతు చేయలేదు. కొన్నిచోట్ల విద్యార్థులు పడుకునేందుకు బెడ్లు లేకపోవడంతో నేలపై నిద్రిస్తున్నారు. గీజర్లు లేకపోవడంతో చన్నీటి స్నానాలు చేస్తూ చలికి ఇబ్బంది పడుతున్నారు. చాలా వసతి గృహాలు అద్దె భవనంలో కొనసాగుతుండగా, గీజర్లు ఉన్నచోట విద్యార్థులు వేడి నీటిని పట్టుకుని స్నానాలు చేస్తున్నారు.

నేలపైనే నిద్ర..పరిశీలించిన వసతి గృహం: కోరుట్ల ప్రభుత్వ మహిళా వసతి గృహం
విద్యార్థుల సంఖ్య: 80
దుప్పట్లు: లేవు
సమస్య: విద్యార్థినులు పడుకునేందుకు బెడ్లు లేకపోవడంతో నేలపైనే నిద్రిస్తున్నారు. శీతాకాలంలో దుప్పట్లు, పరుపులను సరఫరా చేయకపోవడంతో ఇళ్ల నుంచి తెచ్చుకున్న పలుచటి దుప్పట్లను కప్పుకుంటూ చలికి ఇబ్బందులు పడుతున్నారు. వసతిగృహం చుట్టు ప్రహరీ లేకపోవడంతో రక్షణ లేకుండా పోయింది. కోరుట్ల

అరకొరగా వేడి నీళ్లు
తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, మెట్‌పల్లి
విద్యార్థుల సంఖ్య:309
దుప్పట్లు: అందరికీ ఉన్నాయి
సమస్య: విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండగా, ఐదు గీజర్లు ఉండడంతో ఒకే సమయంలో స్నానానికి వేడి నీళ్లు సరిపోవడం లేదు. సోలార్ హీటర్లు కావాలని విద్యార్థులు కోరుతున్నారు.

మెట్‌పల్లి చన్నీటి స్నానమే..
విద్యార్థుల సంఖ్య:అల్లీపూర్ బీసీ గురుకులం ్య 467 మంది
దుప్పట్లు: దుప్పట్లు పంపిణీ చేశారు.
సమస్య: గదుల కొరత కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కిటికీలు, తలుపులు మరమ్మతు చేశారు. గీజర్లు లేకపోవడంతో చన్నీటి స్నానం చేస్తున్నారు.రాయికల్


చలిని తట్టుకోని దుప్పట్లు
మల్లాపూర్ ఎస్టీ వసతి గృహం
విద్యార్థుల సంఖ్య:117 మంది
దుప్పట్లు:పలుచనివి ఉన్నాయి
సమస్య: కొద్ది రోజులుగా ఉష్ణగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో విద్యార్థినులు అల్లాడుతున్నారు. చలిని తట్టుకొనే దుప్పట్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కంటే వసతిగృహంలో సౌకర్యాలు మెరుగు పరిచినప్పటికీ కిటికీలకు తలుపులు ఉన్నప్పటికీ దోమలు రాకుండా జాలీలను ఏర్పాటు చేయాల్సి ఉంది. విద్యార్థినులు రాత్రిపూట వెనుకవైపున ఉన్న ఖాళీ ప్రదేశంలో భోజనాలు చేస్తుండటంతో వణికిపోతున్నారు. మల్లాపూర్ సౌకర్యాలు కల్పిస్తున్నాంవసతిగృహాల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్నాం. చలికాలం విద్యార్థులకు దుస్తులు సరఫరా చేశాం. సంక్షేమ వసతిగృహాల్లో చిన్న చిన్న సమస్యలు తప్పితే అంతా బాగున్నాయి. గీజర్లను ఏర్పాటు చేయడంతో విద్యార్థులు వేడి నీటిని పట్టుకుని స్నానాలు చేస్తున్నారు. పలుచోట్ల బెడ్లు లేకపోవడంతో నేలపై పడుకోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. సాయిబాబా జిల్లా బీసీ సంక్షేమ అధికారి

# సరిపోని స్థలం.. రోడ్డుపైనే విక్రయం

వికారాబాద్ : రైతులు పండించిన కూరగాయలను విక్రయించటం కోసం వికారాబాద్‌లో రైతు బజార్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్థలం రైతులకు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపైనే విక్రయించాల్సి వస్తోంది. రెండింతలయ్యారు దాదాపు 8 సంవత్సరాల క్రితం రైతు బజార్‌ను అప్పటి పరిస్థితులకు అనుగుణంగా నిర్మించారు. ఇప్పుడు జనాభా రెండింతలయ్యారు. దీంతో రైతులు విక్రయానికి తెచ్చిన కూరగాయలను ఇరుకిరుగ్గా పెట్టి విక్రయించుకోవాల్సి వస్తోంది. స్థలం సరిపోక తరచుగా రైతుల మధ్య గొడవలు జరిగిన ఘటనలు ఉన్నాయి. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో రైతు బజారులో పెద్దగా కొనుగోలుదారుల రద్దీ లేకపోయినా సాయంత్రం విపరీతంగా రద్దీ ఉంటోంది.

ఎకరంలో ఏర్పాటు

రైతుల కోసం ఎకరం స్థలంలో రైతు బజార్‌ను ఏర్పాటు చేశారు. 39 స్టాల్స్, 11 షట్టర్స్ ఉన్నాయి. రైతు బజార్ నుంచి ప్రతి ఏటా రూ.5 లక్షల ఆదాయం వస్తోంది. షట్టర్లు, దుకాణాల ద్వారా కూడా ఆదాయం వస్తోంది. దీనికి పరిసర గ్రామాలైన గిరిగిట్‌పల్లి, నాగిరెడ్డిపల్లి, తిమ్మారెడ్డిపల్లి, బీరెల్లి, యాపురం, కొత్తగడి తదితర గ్రామాల నుంచి కూరగాయలు విక్రయానికి వస్తాయి. కార్డుదారులకే అవకాశం: రైతు బజార్‌లో కూరగాయలను విక్రయించటానికి ముందుగా పేరు నమోదు చేసుకుని రైతు కార్డును రైతులు తీసుకుంటారు. కార్డు లేని వారిని అనుమతించరు. కార్డులు తీసుకున్న



పాత వారు 400 మంది రైతులుండగా ఇటీవల 200 మందికి కార్డులు జారీ చేశారు. వికారాబాద్‌లో సంత జరుగుతుంది. సంత రోజు 200-250 మంది రైతులు వస్తుంటారు.

లెక్కల్లో గమనిస్తే..
ప్రతి రోజు రైతు బజార్‌కు వచ్చే రైతులు: 120మంది
ఏర్పాటు : 2014
ఏటా ఆదాయం: రూ.4 లక్షలు
రోజూ కూరగాయల విక్రయం: 40 క్వింటాళ్లు
వచ్చేవి: టమాట, బీరకాయ, వంకాయ, చిక్కుడు, క్యారెట్, ఉల్లిగడ్డ, పాలకూర, మెంతికూర, తోటకూర, క్యాజేజి, క్యాలీఫ్లవర్.

# ధర్మపురి ప్రయాణ ప్రాంగణం.. సమస్యల నిలయం

ధర్మపురి : రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన ధర్మపురి పుణ్యక్షేత్రంలోని ఆర్టీసీ బస్టాండు అసౌకర్యాలకు నిలయంగా మారింది. మార్గశిర మాసం సందర్భంగా ప్రతిరోజు వేలాది మంది భక్తులు ఆర్టీసీ బస్సుల్లో వస్తున్నారు. కనీస వసతులు కరవై ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. జగిత్యాల ఆర్టీసీ బస్సు పరిధిలోని ధర్మపురికి రోజూ 200 ట్రిప్పుల బస్సులు వచ్చి వెళుతున్నాయి. ప్రతి బుధ, శుక్ర, శనివారాల్లో పెద్ద సంఖ్యలో గోదావరినది స్నానం, దైవ దర్శనానికి వస్తుంటారు. దశాబ్దాలుగా కరీంనగర్ నుంచి నేరుగా ధర్మపురికి బస్సును నడిపించడం లేదు. దీంతో భక్తులు వయా జగిత్యాల రావాల్సి వస్తోంది.

తిష్ట వేసిన సమస్యలెన్నో..ధర్మపురి బస్టాండులో సమస్యలు మిన్నంటాయి. ఎక్కడి చెత్త అక్కడే నిలిచిపోతోంది. తాగు నీటి సమస్య వేధిస్తోంది. బోర్‌వెల్ ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నా, ఇవి కలుషితం కావడంతో పాటు, దుర్వాసన వెదజల్లుతోందని ప్రయాణికులు వాపోతున్నారు. ఆరు నెలల క్రితం ఇక్కడి కంట్రోలర్ బదిలీపై వెళ్ళారు. అప్పటి నుంచి వేరే వారిని నియమించలేదు. భక్తులు, ప్రయాణికులకు సమాచారం అందించే వారు, సమాధానం ఇచ్చే వారు కరవయ్యారు. ప్లాట్‌ఫాంలు



నాలుగే ఉండగా, విస్తరణ చేయాల్సి ఉండగా, చేపట్టడం లేదు.

మరుగుదొడ్ల నిర్మాణంపై అభ్యంతరాలు

బస్టాండు ఆవరణలో నూతనంగా మరుగుదొడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై ప్రయాణికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పనులను ఎన్నికలకు ముందు ప్రారంభించారు. మధ్యలోనే ట్యాంకును నిర్మిస్తున్నారు. భవిష్యత్తులో ప్లాట్‌ఫాంల విస్తరణకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది. దీనికి తోడు దుర్వాసన వెదజల్లే అవకాశముంది.

తక్షణం చర్యలు తీసుకుంటాం..

బస్టాండులో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం. ఇటీవలే బదిలీపై వచ్చాను. పూర్తిగా అవగాహన చేసుకుని పరిష్కారానికి కృషి చేస్తా. మధ్యలో నిర్మిస్తున్న మరుగుదొడ్ల విషయంలో అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో పరిశీలించి, వెంటనే ఇంజినీరింగు అధికారులతో మాట్లాడుతాం. తాగు నీరు, పారిశుద్ధ్యం పనులపై తక్షణం చర్యలు తీసుకుంటాం.సునీత, జగిత్యాల ఆర్టీసీ డీఎం

# మిల్లర్ల మేత!

జగిత్యాల : జగిత్యాల జిల్లాలో రైసుమిల్లర్లు బియ్యమే కాకుండా ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. నాలుగైదేళ్లుగా మిల్లర్లపై అనేక ఫిర్యాదులున్నప్పటికి అధికారులు నామమాత్రపు తనిఖీలు నిర్వహించి చూసీచూడనట్లు వ్యవహరించారు. పౌరసరఫరాల అధికారులు ఇప్పటి వరకు 30 ధాన్యం మిల్లుల్లో తనిఖీలు నిర్వహించగా 26 మిల్లుల్లో సుమారు లక్ష క్వింటాళ్ల ధాన్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. బుధవారం తనిఖీలు నిర్వహించిన 5 మిల్లుల్లోనే ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం కంటే 80,335.06 క్వింటాళ్ల ధాన్యం తక్కువగా ఉన్నట్లు తేలింది. పొలాస లక్ష్మినర్సింహ ఇండస్ట్రీస్‌లో 10375.6 క్వింటాళ్లు, కల్లెడ ఆంజనేయ రైస్‌మిల్లులో 12999.00 క్వింటాళ్లు, కోరుట్ల కొత్త సురేష్ రైస్‌మిల్లులో 33297.00 క్వింటాళ్లు, కోరుట్ల కొత్త సురేష్ ఆగ్రో రైస్‌ఇండస్ట్రీస్‌లో 18480.00, కొత్త శ్రీయాన్ రైస్ ఇండస్ట్రీస్‌లో 5184.00 క్వింటాళ్ల ధాన్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ధాన్యం తక్కువగా ఉన్న 26 మిల్లుల యజమానులకు నోటీసులు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించిన నేపథ్యంలో పౌరసరఫరాల అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారు.


కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని ప్రభుత్వం మిల్లర్లకు ఇస్తుండగా 67 శాతం రా, 68 శాతం బాయిల్డ్ బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. అనేక మంది మిల్లర్లు ధాన్యం తీసుకుని బియ్యం ఇవ్వకపోగా తనిఖీల సందర్భంగా మిల్లుల్లో అటు ధాన్యం ఇటు బియ్యం లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 3 నెలల క్రితం 38 ధాన్యం మిల్లులను డిఫాల్టర్లుగా గుర్తించి వారి నుంచి సుమారు రూ.2.12 కోట్ల జరిమానా వసూలు చేయాలని నిర్ణయించగా అందులో 25 మంది నుంచి సుమారు కోటి రూపాయలు రికవరీ చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ ప్రతినెలా పౌరసరఫరాల అధికారులతో బియ్యం రికవరీపై సమీక్ష జరుపుతున్నప్పటికి



క్షేత్రస్థాయిలో లక్ష్యం మేరకు రికవరీ జరగడం లేదు. గత నెలలో ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో బియ్యం ఇవ్వని 6 మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టారు. 2021-22 వానాకాలం, యాసంగి సీజన్లలో తీసుకున్న ధాన్యానికి ఇప్పటి వరకు ప్రభుత్వానికి బియ్యం ఇవ్వని మిల్లర్లు కూడా ఉన్నారు. ఆసంవత్సరం వానాకాలం సీజన్‌లో 12 మంది మిల్లర్లు 3084.002 మెట్రిక్ టన్నులు, యాసంగికి సంబంధించి నలుగురు మిల్లర్లు 3063.171 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది. గత రెండునెలల్లో జగిత్యాల రైల్వేస్టేషన్ నుంచి 3 వ్యాగన్ల బియ్యాన్ని చెన్నై తరలించారు. అనేక మంది మిల్లర్లు ధాన్యాన్ని సైతం పక్కదారి పట్టించి రేషన్ బియ్యం కొనుగోలు చేసి సర్దుబాటు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. 2022-23 వానాకాలం సీజన్‌లో మిల్లర్లకు 3.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇచ్చారు. 2.27 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉండగా గత నెల వరకు 1.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇచ్చారు. ఈనెలాఖరు వరకు వందశాతం బియ్యం ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 60 శాతం బియ్యం ఇచ్చారు. ప్రస్తుతం అధికారుల తనిఖీల నేపథ్యంలో మిల్లర్లల్లో వణుకు మొదలైంది. కాగా జిల్లాలోని అన్ని మిల్లులను తనిఖీలు నిర్వహిస్తామని అక్రమాలు జరిగినట్లు తేలితే ఆయా మిల్లర్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత పేర్కొన్నారు.

# పక్కా ప్రణాళిక.. పటిష్ఠ కార్యాచరణ

హైదరాబాద్: పది ఫలితాల్లో గతేడాది జిల్లా తీవ్ర నిరాశకు గురిచేసింది. ఈ వాస్తవాన్ని గుర్తించిన అధికారులు ఈ విద్యా సంవత్సరం ఆరంభం నుంచే ప్రత్యేక దృష్టి సారించారు. పది వార్షిక పరీక్షల్లో గుణాత్మకమైన ప్రగతి సాధించేందుకు రాష్ట్ర విద్యా, పరిశోధన, శిక్షణ మండలి ఆధ్వర్యంలో 'లక్ష్య' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. నవంబరు నుంచే జిల్లాలో ప్రత్యేక తరగతుల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. విద్యార్థుల ప్రతిభను అంచనా వేస్తూ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు.
జిల్లాలో అమలు ఇలా..ఈ ఏడాది మెరుగైన స్థానం సాధించాలనే తపనతో విద్యా శాఖ అధికారులు ఫలితాలపై దృష్టి సారించారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా సమీక్షించుకుంటూ వెనుకబడిన విద్యార్థులను గుర్తించి సాధన చేయిస్తున్నారు.'లక్ష్య' కార్యక్రమ అమలులో భాగంగా వార్షిక పరీక్షల నిర్వహణకు నాలుగు నెలల ముందునుంచే విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, ఎన్నికల విధులతో పాఠ్యాంశాలు కొన్నిచోట్ల పూర్తి కాలేదు. ఈ నెలాఖరు నాటికి పాఠ్యాంశాల బోధన పూర్తి చేయడా నికి ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. తరువాత నుంచి విద్యార్థులకు పునశ్చరణ కొనసాగిస్తూ



ప్రత్యేక తరగతులను నిర్వహించాలని ఆదేశించారు. అందుకు అనుగుణంగా సమయ సారిణి తయారు చేసి ఉదయం వేళల్లో నిత్యం పాఠ్యాంశాల వారీగా తరగతులు కొనసాగిస్తున్నారు.
డిజిటల్ తరగతులతో పాటు అభ్యాస దీపికలతో పాఠ్యాంశాల వారీగా రాసుకుంటూ హెూం వర్క్ చేసుకోవాలని సూచిస్తున్నారు.

పలుచోట్ల బస్సులు లేక..
మండలానికి కనీసం 5 గ్రామాల చొప్పున జిల్లాలో సకాలంలో బస్సు సౌకర్యం లేక ఉదయం వేళ్ల అల్పాహారం చేయకుండానే విద్యార్థులు బడికి వస్తున్నారు. జిల్లాలో గ్రామీణ ప్రాంత విద్యార్థులే ఎక్కువ సంఖ్యలో ప్రభుత్వ బడుల్లో చదువుతున్నారు. గ్రామాల నుంచి ఐదారు కి.మీ. కంటే ఎక్కువ దూరం నడిచి ఉన్నత పాఠశాలలకు వెళ్తున్నారు. ఉదయం పూట రాగిజావ అందిస్తుండగా మధ్యాహ్న భోజనం పాఠశాలలో చేస్తున్నారు. ప్రత్యేక తరగతులకు దూరప్రాంతాల నుంచి రావటంతో అలసటకు గురవుతున్నారు. దీనివల్ల అలసటకు గురై చదువుపై ఆసక్తి తగ్గుతోందని కొందరు ఉపాధ్యాయులు తెలిపారు.


మొత్తం ఉన్నత పాఠశాలలు..156
2023-24 లో పది పరీక్షలకు హాజరయ్యేది..8355
వీరిలో బాలురు.. 4,088
బాలికలు.. 4,267

మెరుగైన ఫలితాలకు కృషిఈ ఏడాది పదిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం. ప్రత్యేక తరగతుల నిర్వహణకు మార్గదర్శకాలు తెలియజేశాం. ఎన్నికల విధులతో ఆలస్యం జరిగినా పాఠ్యాంశాల బోధన పూర్తి చేస్తూ ముందుకు సాగుతున్నారు. విద్యార్థులు సైతం గత ప్రశ్నపత్రాలతో ముఖ్యమైన అంశాలపై శ్రద్ధ చూపాలి .రేణుకాదేవి, జిల్లా విద్యాశాఖ అధికారి

# బకాయిల మేట.. మళ్లీ రుణ బాట

హైదరాబాద్ : ఇప్పటికే రూ.6వేల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిన జీహెచ్‌ఎంసీ.. మళ్లీ నిధులు సమీకరించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. పది నెలలుగా పేరుకుపోయిన గుత్తేదారుల బకాయిలను కూడా బ్యాంకు రుణంతో చెల్లించాలని నిర్ణయించింది. నెల క్రితం ప్రక్రియ మొదలవగా.. రూ.100కోట్ల బిల్లులను బ్యాంకులు ఆమోదిం చాయని, గుత్తేదారుల ఖాతాలో జమ కావడమే తరువాయి అని అధికారులు స్పష్టం చేశారు. చిన్న, మధ్య తరహా వ్యాపారాలను ప్రోత్సహించే ట్రెడ్స్(ట్రేడ్ రిసీవబుల్స్ డిస్కౌంటింగ్ సిస్టమ్) విధానం ద్వారా.. బ్యాంకుల నుంచి నిధుల సాయం తీసుకుంటున్నట్లు వెల్లడిం చారు. మరో రూ.700కోట్ల నిధులను ఇదే పద్ధతిలో సమీకరించే అవకాశముందని అంచనా వేశారు.

జీహెచ్‌ఎంసీకీ భారమే..
ట్రెడ్స్ విధానంలో జీహెచ్‌ఎంసీ హామీపై బ్యాంకులు గుత్తేదారుకు నిధులిస్తున్నాయి. అందుకుగాను.. గుత్తేదారు వద్దనే వడ్డీ వసూలు చేస్తున్నాయి. ఆయా నిధులను జీహెచ్‌ఎంసీ ఆరు నెలల్లోపు బ్యాంకులకు తప్పనిసరిగా చెల్లించకుంటే జరిమానా ఉంటుంది. ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు సకాలంలో ఇవ్వలేని జీహెచ్‌ఎంసీకి.. ట్రెడ్స్ మరింత తలనొప్పిగా మారే అవకాశముందనే విమర్శలూ వస్తున్నాయి. మరోవైపు.. తాము చేసిన పనికి వేర్వేరు స్థాయిల్లో అధికారులకు ఆమ్యామ్యాలు ఇచ్చుకుంటూ బ్యాంకుల వద్ద మరో 7.7 శాతం డబ్బు కోల్పోవడం గుత్తేదారులకూ భారమేనని, దాని ప్రభావం పనుల నాణ్యతపై పడుతుందని నిపుణులంటున్నారు.
వడ్డీ భారం గుత్తేదారులపైనే..పీకల్లోతు అప్పులతో రోడ్లు, నాలాలు, ఇతరత్రా కాంట్రాక్టుల పనులకు జీహెచ్‌ఎంసీ సకాలంలో బిల్లులు చెల్లించలేకపోతోంది. పది నెలలుగా నిర్వహణ, అభివృద్ధి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో గుత్తేదారులు బకాయిల కోసం ఆందోళనలు



చేపట్టారు. దాంతో జీహెచ్‌ఎంసీ ఆర్థిక విభాగం కొత్త విధానాన్ని తెరపైకి తీసుకొచ్చింది. ట్రెడ్స్ విధానంలో బ్యాంకులు గుత్తేదారులకు బిల్లులను చెల్లిస్తాయి. ఓ ప్రైవేటు ఏజెన్సీ మధ్యవర్తిగా ఉంటుంది. ఇంజినీర్లు ఆమోదించిన బిల్లులను గుత్తేదారులు ఏజెన్సీకి ఇస్తారు. ఏజెన్సీ ప్రతినిధులు వాటిని రూఢి చేసుకుని.. బ్యాంకుల ముందుంచుతారు. చాలా బ్యాంకులు ఈ ప్రక్రియలో పాల్గొంటాయి. వార్షిక వడ్డీని ప్రతిపాదిస్తాయి. తక్కువ వడ్డీతో బిల్లులు చెల్లిస్తామన్న బ్యాంకును గుత్తేదారులు ఎంచుకుంటారు. పత్రాలను సమర్పిస్తే బ్యాంకు నిధులను ఇస్తుంది. తాజాగా 122 రోజుల క్రితం నాటి రూ.100 కోట్ల బిల్లులకు నిధులు మంజూరయ్యాయి. బిల్లు మంజూరైన నాటి నుంచి నిధులు విడుదల చేసే రోజు వరకు 7.7 శాతం వడ్డీని మినహాయించుకుని, మిగిలిన మొత్తాన్ని ఖాతాలో జమ చేస్తామంటున్నారు. గుత్తేదారులు ముందుకొస్తే రూ.700 కోట్ల బకాయిలకూ ఇదే మాదిరి నిధులను సమకూర్చామన్నారు.

# నగరం మత్తు వదిలించేదెలా?



హైదరాబాద్: నగరంలోని డ్రగ్ ముఠాలతో మరోసారి గోవా లింకులు బయటపడుతున్నాయి. జైలు నుంచి బయటకు వచ్చిన డాన్‌లు తమ పాత పరిచయాలను పునరుద్ధరించుకుని దందా ప్రారంభించినట్టు పోలీసులు భావిస్తున్నారు. ఈ నెల 16న అమీర్‌పేట్‌లోని ఒక సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో మత్తు పార్టీ నిర్వహించిన ప్రధాన నిందితులు ఆశిక్‌యాదవ్, రాజేశ్, సాయిచరణ్‌లలో ఇద్దర్ని టీఎస్ న్యాబ్, ఎస్సార్‌నగర్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఎక్సటసీ పిల్స్‌ను గోవాలోని బాబా అనే సప్లయర్ వద్ద కొనుగోలు చేశారు. వాటిని హైదరాబాద్, నెల్లూరు జిల్లాల్లోని సుమారు వంద మందికి పైగా కొనుగోలుదారులకు విక్రయించినట్టు పోలీసుల దర్యాప్తులో నిర్ధారించారు. సప్లయర్ బాబాకు గోవా డ్రగ్ డాన్ ఎడ్విన్‌న్యూన్స్‌తో సంబంధాలు ఉన్నట్టు గుర్తించారు. వీరిద్దరూ కలిసే నగరంలోని పాత డ్రగ్ సప్లయర్స్, పెడ్లర్స్‌కు కొకైన్, హెరాయిన్, ఎక్సటసీ సరఫరా చేస్తున్నారు.
కొత్త సంవత్సర వేడుకలే లక్ష్యంగా.. నగరంలో మత్తు రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు గతేడాది హైదరాబాద్ నార్కొటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఏర్పాటు చేశారు. ఢిల్లీ, గోవా, ముంబయి, బెంగళూరు నగరాలతో ఇక్కడి పెడ్లర్స్ పరిచయాలను జల్లెడ పట్టారు. గతేడాది సెప్టెంబరులో ఓయూ పోలీసులకు పట్టుబడిన ప్రీతిష్ నారాయణ్‌బోర్కర్ నుంచి రాబట్టిన సమాచారంతో గోవాలోని డ్రగ్ డీలర్ల నుంచి నగరానికి పెద్దమొత్తంలో మాదక ద్రవ్యాలు చేరుతున్నట్టు గుర్తించారు. ఇతడి వద్ద డ్రగ్స్ కొనుగోలు చేసిన 174 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ ముఠాల గుట్టు రట్టు చేసేందుకు పోలీసులు గోవాలోనే మకాం వేశారు. అంతర్జాతీయ డ్రగ్ ముఠాలతో సంబంధాలు ఏర్పాటు చేసుకుని డాన్‌లుగా ఎదిగిన స్టీవ్ ఎడ్విన్‌న్యూన్స్, జాన్ స్టీఫెన్ డిసౌజా అలియాస్ స్టీవ్, వికాస్‌నాయక్, విక్కీ రమేశ్ వంటి కీలక సూత్రధారులను ఒక్కొక్కరిగా అరెస్టు చేశారు. తరువాత బెంగళూరులోని నైజీరియన్లు నగరంపై కన్నేసి దందా ప్రారంభించారు. గోవా డ్రగ్స్ రవాణాను కట్టడి చేశామని భావిస్తున్న పోలీసులకు తాజా ఘటనలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఎడ్విన్‌న్యూన్స్, స్టీఫెన్ డిసౌజా స్వయంగా నగరంలోని పెడ్లర్స్‌తో మంతనాలు ప్రారంభించారు. కొత్త ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని ఏపీ, తెలంగాణల్లో కొన్ని పబ్‌లు, బార్‌లకు కొకైన్, ఎల్‌ఎస్‌డీ బ్లాట్స్, ఎక్సటసీ సరఫరా చేస్తున్నారు. కొత్త సంవత్సర వేడుకలను సొమ్ము చేసుకునేందుకు గోవా ముఠాలు నగరంలో మకాం వేసినట్టు పోలీసులకు సమాచారం రావటంతో అప్రమత్తమయ్యారు.

# గొలుసు కట్టులో పల్లె ఉక్కిరిబిక్కిరి



తాండూరు: గ్రామీణ నేపథ్య జిల్లాపై 'గొలుసు దుకాణాల' మాటున మళ్లీ మద్యం పంజా విసురుతోంది. ఎన్నికల కారణంగా అధికారులు దృష్టి సారించక పోవడం, నిఘా తక్కువ కావడం వంటి కారణాలతో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఫలితంగా పేద, మధ్య తరగతి కుటుంబాలు ఛిద్రమవుతున్నాయి.

ఎన్నికలు ముగియటం ఆలస్యం..
అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగానే అధికారులు తీసుకున్న చర్యలతో జిల్లా వ్యాప్తంగా గొలుసు దుకాణాలు మూత పడ్డాయి. ఎన్నికలు ముగియగానే మళ్లీ తెరుచుకున్నాయి. పల్లెలు పట్టణాల్లోని పలు కిరాణ దుకాణాలు మద్యం అమ్మకాలకు అడ్డాగా మారాయి. ఆడా, మగా తేడా లేకుండా మద్యం తాగుతూ ఎక్కడపడితే అక్కడే పడిపోతున్నారు. యువత పూర్తిగా మద్యానికి బానిసలై పోతున్నారు.

పచ్చని కాపురాల్లో చిచ్చు రేపుతోంది
3 వేల దుకాణాలు
జిల్లా వ్యాప్తంగా 3 వేలకు పైగా మద్యం గొలుసు దుకాణాలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని వికారాబాద్, మోమిన్‌పేట, తాండూర్, పరిగి, కొడంగల్ ఆబ్కారీ వలయాధికారుల కార్యాలయం పరిధిలో 59 మద్యం దుకాణాలు, 5 బార్లు ఉన్నాయి. వైన్స్ షాపు యజమానులే ఆటోల్లో మద్యాన్ని గ్రామాల్లోని కిరాణ దుకాణాలకు సరఫరా చేస్తూ అమ్మకాలు పెంచుకుంటున్నారు.
సీఎం ఆదేశాలతో..: తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మద్యం గొలుసు దుకాణాలను అరికట్టాలని ఆదేశాలు జారీ చేయడంతో ఆ దిశగా అధికారులు చర్యలకు ఉపక్రమిస్తున్నారు. దుకాణదారులకు ముందస్తు హెచ్చరికలు చేస్తున్నారు.

ఇవిగో ఉదాహరణలు
పెద్దేముల్ మండలంలోని ఓ గ్రామంలో మద్యానికి బానిసైన ఓ వ్యక్తి డబ్బుల కోసం వృద్ధురాలి (నాయనమ్మ)పై కర్రతో దాడి చేసి వచ్చిన పింఛన్ డబ్బులను లాక్కున్నాడు.
పరిగి మండలంలో మద్యానికి బానిసైన ఓ భర్త డబ్బులు ఇవ్వకపోవడంతో భార్యకు ఇతరులతో అక్రమ సంబంధం అంటగట్టి నిత్యం తీవ్ర వేధింపులకు గురి చేశాడు.
కొడంగల్ మండలంలో ఓ యువకుడు మద్యం తాగి ద్విచక్ర వాహనం నడుపుతూ లారీని ఢీ కొట్టి మృత్యువాత పడ్డాడు.


ఇప్పటివరకు ఇదీ లెక్క
మద్యం గొలుసు దుకాణదారులపై కేసులు: 356
అరెస్టు: 214
స్వాధీనం చేసుకున్న మద్యం: 4,575 (లీటర్లు)
బీరు: 340 (లీటర్లు)
బైండోవర్లు: 155

ప్రత్యేక నిఘా..
మద్యం గొలుసు దుకాణాలపై ప్రత్యేక నిఘా పెడుతున్నాం. ఇందుకు జిల్లాలోని అన్ని పోలీస్‌ఠాణాల నిలయాధికారులకు ఆదేశాలు జారీ చేశాం. ఎవరైనా సరే గొలుసు దుకాణాలపై స్థానిక పోలీసులు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలి.కోటిరెడ్డి, జిల్లా పోలీసు అధికారి
ఎవరినీ ఉపేక్షించంనిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదు. గొలుసు దుకాణాల సమాచారంపై జిల్లా కంట్రోల్ రూం (8074559147) నంబర్‌కు సమాచారం ఇస్తే వివరాలు గోప్యంగా ఉంచి చర్యలు తీసుకుంటాం.నవీన్‌చంద్ర, జిల్లా ఆబ్కారీ అధికారి

# విదేశీ విద్యార్థులూ రండి

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతుండడంతో ఉస్మానియా విశ్వవిద్యాలయం అధికారులు విదేశీ వ్యవహారాల విభాగం సంచాలకుల ద్వారా విదేశీ రాయబారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. తుర్కమెనిస్తాన్ కాన్సుల్ కార్యదర్శి హమ్మత్ ముహమ్మదేవ్, రాయబార కార్యాలయ ఛాన్సరీ హెడ్ మెయిలిస్ బాషిమోవ్‌లను కొద్దిరోజుల క్రితం వర్సిటీకి ఆహ్వానించారు. త్వరలో మరింతమంది విదేశీ రాయబారులతో చర్చించనున్నారు.
ఫెలోషిప్‌లు పెరిగితేనే..కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంతర్జాతీయ సాంస్కృతిక సంబంధాల మండలి మనదేశంలో చదువుకునేందుకు విదేశీ విద్యార్థులకు ఫెలోషిప్‌లు ఇస్తోంది. గతంలో ఏటా రెండువేల ఫెలోషిప్‌లు ఇవ్వగా, ప్రస్తుతం వెయ్యికి తగ్గించింది. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, ఇరాన్ దేశాల రాజకీయ పరిస్థితులు కారణంగా ఆ దేశాల విద్యార్థులకు ఫెలోషిప్‌లు నిలిపేశారు. కొన్ని ఆఫ్రికా దేశాలకు సైతం. ఫెలోషిప్ ఉంటే.. కోర్సు మొత్తానికి అయ్యే ఖర్చులో 40 నుంచి 70 శాతం వరకూ తగ్గుతుంది. ఫెలోషిప్‌ల మంజూరుపై అంతర్గత భద్రత, విదేశీ వ్యవహారాల వంటివి ఆధారపడడంతో నిర్ణయం.. అంత సులువు కాదని నిపుణులు చెబుతున్నారు.

విదేశీ విద్యార్థులు ఇలా..
ఆఫ్ఘనిస్తాన్-87, సూడాన్-69, యెమన్-63, అమెరికా- 48, తుర్కిమెనిస్తాన్-31, సోమాలియా-27, ఇథియోపియా-26 ఇతరులు-64.



ఉపాధి అవకాశాలంటూ ఆహ్వానిస్తున్నాం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డిగ్రీ, పీజీలు చదువుకుంటే మీ మీ దేశాల్లో ఉపాధి అవకాశాలుంటాయంటూ వారిని ఆహ్వానిస్తున్నాం. పీజీ తర్వాత పరిశోధక విద్యార్థులుగా చదువుకుంటే ఉపకార వేతనాలు వస్తాయని వివరిస్తున్నాం. అన్ని అంశాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ ద్వారా ప్రచారం చేస్తున్నాం. ఇక్కడ చదువుకుంటున్న విదేశీ విద్యార్థులు వారి సొంత దేశాలకు వెళ్లినప్పుడు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యా ప్రమాణాలను ప్రచారం చేయాలంటూ కోరుతున్నాం. పదోన్నతుల కోసం ఉన్నత విద్యను అభ్యసించేందుకు వచ్చిన అక్కడి అధికారులకు సైతం విషయాన్ని వివరించి ఓయూలో ప్రవేశాలు పెరిగేలా సహకరించాలని అభ్యర్థిస్తున్నాం. ప్రొఫెసర్ శివరామకృష్ణ, ఓయూ

# దాచేస్తే దాగని నిజం

రాయదుర్గం : ఖాజాగూడలో విలువైన ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైంది. నకిలీ పట్టా సృష్టించి రూ.15 కోట్లకుపైగా విలువైన 1500 గజాలపైగా స్థలాన్ని ఆక్రమిస్తున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. ఎవరికీ కనిపించకుండా పరదాలు కట్టి లోపల తవ్వకాలు సాగిస్తూ నిర్మాణాలు చేపట్టే పనులు చేస్తున్నారు.

ఎన్నికల విధుల్లో అధికారులు ఉండగా..
ఖాజాగూడ సర్వే నం.40లో ఈ అక్రమం సాగుతోంది. ఏళ్ల క్రితమే ఈ స్థలంపై కన్నేశారు. రాయదుర్గంలో రెండు దశాబ్దాల క్రితం రోడ్డు విస్తరణకు ప్రభుత్వం స్థల సేకరణ చేపట్టింది. ఇదే అదనుగా రోడ్డులో స్థలం కోల్పోగా పరిహారంగా ఆర్డీవో 400 గజాల స్థలం కేటాయించినట్లు నకిలీ దస్తావేజు సృష్టించారు. 15 ఏళ్ల క్రితం నల్గొండ నుంచి నగరానికి వలస వచ్చిన ఓ వృద్ధుడి పేరిట బినామీ పేరుతో నకిలీ పట్టా సృష్టించి అక్రమానికి తెరలేపారు. ఆయన రాయదుర్గంలో నివసించిన



దాఖలాల్లేవు. వచ్చినప్పటి నుంచి సదరు వృద్ధుడు ఖాజాగూడలోనే ఉంటున్నా రాయదుర్గం వాసిగా పేర్కొంటూ పట్టా సృష్టించారు. ఆ నకిలీ పట్టాలో 400 గజాల స్థలం కేటాయించినట్లు ఉండగా 1500 గజాలకుపైగా జాగాకు గురిపెట్టారు. రెవెన్యూ అధికారులు ఎన్నికల విధుల్లో ఉండగా ఆక్రమణదారులు స్థలానికి పరదా కట్టి లోపల రాళ్లు తొలగించి చదును చేసే పనులు ప్రారంభించారు. డ్రిల్లింగ్ యంత్రాలతో బండరాళ్లను పగులగొట్టి స్థలాన్ని చదును చేశారు. 8 నెలల కిందట ఇదే విధంగా కబ్జాకు యత్నించగా నాటి ఆర్ఐ అడ్డుకున్నారు. ఆయన బదిలీ కావడం, ఎన్నికలు రావడంతో ఆక్రమిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం: శంకర్, డిప్యూటీ తహసీల్దార్
ఆ స్థలం పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. ఆక్రమణలు తొలగించి స్వాధీనం చేసుకుంటాం. చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

# సాంకేతికం.. ఉపాధ్యాయుల శిక్షణకు దోహదం

పెద్దపల్లి : పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో బోధన అందించేందుకు విద్యాశాఖ పలు సంస్కరణలు అమలు చేస్తోంది. పిల్లల్లో బోధనా సామర్థ్యాలు పెంచేందుకు తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య వంటి కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిస్తోంది. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం మొదలుకుని మౌలిక వసతుల వివరాలు సర్వం సాంకేతికతలో నిక్షిప్తమవుతున్నాయి. ఈ క్రమంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు మండల వనరుల కేంద్రాలకు (ఎమ్మార్సీ) కంప్యూటర్లు మంజూరు చేసింది. విద్యా ప్రగతి నివేదికలతో పాటు ఉపాధ్యాయులకు వృత్తి నైపుణ్యత, సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇచ్చేందుకు వీటిని వినియోగించనున్నారు.

మండలానికి ఆరు కంప్యూటర్లు
ఉమ్మడి జిల్లాలో 47 మండలాలకు కంప్యూటర్లు సరఫరా చేశారు. అయితే వీటిని పాత మండలాలకే కేటాయించారు. ప్రతి మండలానికి ఆరు చొప్పున కంప్యూటర్లు, ప్రింటర్లున్నాయి. కేవీఏ యూపీఎస్, ఎంఎస్ ఆఫీస్ సాఫ్ట్‌వేర్, స్విచ్‌బోర్డులు, కేబుల్ వైర్లు, జాక్ ప్యానెల్, ఇంటర్నెట్ కనెక్షన్ కోసం అవసరమైన సామగ్రి అందించారు. ఇప్పటి వరకు మండలానికి రెండు మాత్రమే కంప్యూటర్లు ఉండేవి. కొన్ని చోట్ల ప్రింటర్లు లేకపోవడంతో ఎంఈవోలు సొంతంగా సమకూర్చుకున్నారు. ప్రస్తుతం ఆరు కంప్యూటర్లు ఉండటంతో ఉన్నతాధికారులకు నివేదికలు సకాలంలో అందించనున్నారు.

సకాలంలో వివరాల నమోదు
ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య బోధించేందుకు ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులకు నైపుణ్య శిక్షణనిస్తున్నారు. పాఠశాలల్లో ముఖ గుర్తింపు హాజరు(ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్) విధానం కొనసాగుతోంది. ట్యాబ్‌లు కూడా అందజేశారు. ఇలా పలు సాంకేతిక సేవలు వినియోగించడంతో ఉపాధ్యాయులు కొంత ఇబ్బంది పడుతున్నారు. ఇక నుంచి మండల స్థాయిలో ఉపాధ్యాయులకు కంప్యూటర్ల ద్వారా నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. ఇక సకాలంలో పాఠశాల సముదాయ సమావేశాల వివరాలు, యూడైస్, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజన వివరాలు నమోదు చేయనున్నారు.

కొత్త మండలాలకు నిరాశే
ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఏర్పాటైన మండలాలకు కంప్యూటర్లు పంపిణీ చేయకపోవడంతో నిరాశే ఎదురైంది. పెద్దపల్లి జిల్లాలో పాలకుర్తి, రామగిరి, అంతర్గాం, రాజన్నసిరిసిల్ల జిల్లాలో వీర్నపల్లి, తంగళ్లపల్లి, రుద్రంగి, వేములవాడ గ్రామీణం, కరీంనగర్ జిల్లాలో కొత్తపల్లి, ఇల్లందకుంట, గన్నేరువరం, జగిత్యాలలో బీర్‌పూర్, బుగ్గారం, బీమారం, ఎండపల్లి కొత్తగా ఏర్పాటయ్యాయి. వీటికి సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లను నియమించలేదు. పాత మండల పరిధిలోనే వీటి పర్యవేక్షణ చేస్తున్నారు. ఎంఈవోలు కూడా లేరు.

వినియోగంపై పర్యవేక్షణ
జిల్లాలోని మండలాలకు కంప్యూటర్లు వచ్చాయి. వీటిని త్వరలో ఇన్‌స్టాలేషన్ చేస్తాం. ఎమ్మార్సీల్లో కంప్యూటర్ల వినియోగంపై పర్యవేక్షణ పెంచుతాం. కొత్త కంప్యూటర్లతో ఉపాధ్యాయులకు సాంకేతిక బోధనపై శిక్షణ తరగతులు, పాఠశాల నిర్వహణకు వినియోగిస్తాం.మల్లేశ్, సమగ్ర శిక్షా జిల్లా సమన్వయకర్త

# రౌడీరాజ్యం ఇకపై నడవదు

హైదరాబాద్: నగర కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి హైదరాబాద్ జిల్లా అదనపు మెజిస్ట్రేట్ హెూదాలో తొలిసారి నాలుగు రౌడీషీటర్ల బృందాలను నేరుగా విచారించారు. ఈ రౌడీషీటర్లు వారుండే ప్రాంతాల్లో ఆధిపత్యం కోసం బృందాలుగా ఏర్పడి తరచూ దాడులకు దిగుతున్నారు. ఫలితంగా కొందరు ప్రాణాలు కోల్పోవడంతోపాటు శాంతి భద్రతలకు భంగం కలుగుతోంది. కాలాపత్తర్, బంజారాహిల్స్ ప్రాంతాల్లోని రౌడీషీటర్ల మధ్య పరస్పర దాడుల నేపథ్యంలో తీవ్రత గుర్తించిన ఆయన బుధవారం బంజారాహిల్స్‌లోని ఐసీసీసీకి నాలుగు వర్గాలకూ చెందినవారిని పిలిపించి విచారించారు. రెండు కేసుల్ని తదుపరి విచారణకు వాయిదా వేశారు. విచారించిన కేసుల వివరాలివీ..
ఆధిపత్యం కోసం ముగ్గురి బలి కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ మహ్మద్ షానవాజ్ ఘూజి, మైలార్‌దేవ్‌పల్లి ఠాణా పరిధిలో ఉండే రౌడీషీటర్ మహ్మద్ అర్బాజ్ గ్రూపుల మధ్య స్పర్థలున్నాయి. తమ ప్రాంతంలో ఆధిపత్యం చాటుకునేందుకు ఈ రెండు వర్గాలు తరచూ పరస్పర దాడులకు దిగుతున్నాయి. ఈ దాడుల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. షానవాజ్ వర్గంలో ఇద్దరు, అర్బాజ్ ముఠాలో ఒకరు మరణించారు. మొత్తంగా నాలుగు కేసులు నమోదయ్యాయి. ఇవిగాక ఇతర నేరకార్యకలాపాల్లోనూ నిందితులుగా ఉన్నారు. ఈ వ్యవహారంపై దృష్టి సారించిన కమిషనర్ రెండు వర్గాలనూ పిలిపించి విచారించారు. రౌడీ కార్యాకలాపాలకు పాల్పడొద్దని హెచ్చరించారు.

# అంతటా ఉప్మాహారమే..!

ఆదిలాబాద్ : జిల్లాలోని సర్కారు బడుల్లో సీఎం అల్పాహార పథకం అమలును మమ అనిపించారు. జిల్లాలో పథక అమలు తీరుతెన్నులపై బృందం పరిశీలన చేసింది. ఏ పాఠశాలలోనూ ఆహార పట్టిక పాటించకపోగా.. కొన్నిచోట్ల ఆలస్యంగా.. మరికొన్నిచోట్ల విద్యార్థులు హాజరును బట్టి అప్పటికప్పుడు ఉప్మాను వండిపెట్టారు. బడ్జెట్ కేటాయింపు, మార్గదర్శకాల్లో స్పష్టత లోపించడంతో విద్యాశాఖ అధికారుల్లోనూ అయోమయం నెలకొంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో పథక అమలుకు శ్రీకారం చుట్టారు. దసరా సెలవుల అనంతరం పాఠశాలలు తెరుచుకోవడంతో మండలానికి ఒక పాఠశాలను ఎంపిక చేసి అల్పాహారం వండిపెట్టాలని ఒకరోజు ముందే హడావుడిగా ఆదేశాలు ఇచ్చారు. పాఠశాల సమయానికి 45 నిమిషాల ముందుగా విద్యార్థులకు అల్పాహారం వండిపెట్టాల్సి ఉన్నా.. జిల్లాలో ఎక్కడా ఆ పరిస్థితి కనిపించలేదు. తొలిరోజు కావడంతో విద్యార్థులు వస్తారో.. రారో అని భావించిన ఏజెన్సీ నిర్వాహకులు విద్యార్థుల సంఖ్యను బట్టి ఉప్మాను అప్పటికప్పుడు వండిపెట్టి వడ్డించారు. జిల్లాలో ఇదివరకు రెండు పాఠశాలలను కలుపుకొని మొత్తం 1,332 మంది విద్యార్థులకు అల్పాహారం వండిపెట్టాల్సి ఉండగా.. విద్యార్థుల గైర్హాజరుతో కొద్దిమంది విద్యార్థులే అల్పాహార రుచి చూడాల్సి వచ్చింది. ఖర్చుపై స్పష్టత ఇవ్వకపోవడంతో వంట కార్మికులు అయిష్టంగానే వండిపెట్టారు.

గైర్హాజరు అధికం!

బేల మండలం సిర్సన్న ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు 67 మందికి 25 మంది విద్యార్థులు మాత్రమే పాఠశాలకు వచ్చారు. వారికి సరిపడా ఉప్మాను వండిపెట్టారు. అనారోగ్యంతో వంట చేసే కార్మికులు రాకపోవడంతో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం కొంత ఇబ్బందిని తెచ్చిపెట్టింది. అల్పాహారాన్ని కాంప్లెక్స్ హెచ్ఎం మహాలక్ష్మి, ఎస్ఎంసీ ఛైర్మన్ గేడం జీవన్, హెచ్ఎం ప్రహ్లాద్, సీఆర్పీ వెంకన్న విద్యార్థులతో కలిసి భుజించారు.

25 మంది హాజరు

నేరడిగొండ మండలం రాజూర ఎంపీపీఎస్‌లో అల్పాహార పథక అమలును ఎంఈవో భూమారెడ్డి పరిశీలించారు. పాఠశాలలో 30 మంది విద్యార్థులకు 25 మంది హాజరయ్యారు. నిర్ణీత ఆహార పట్టికకు బదులుగా ఉప్మాతో సరిపెట్టారు.

డీఈవో సందర్శన

జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత ఆదిలాబాద్ అర్బన్, ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని బంగారుగూడ, యాపల్‌గూడ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. బంగారుగూడలో వంట చేయడం ఆలస్యం కాగా.. యాపల్‌గూడకు వెళ్లారు. అక్కడ ఉప్మాను వండిపెట్టారు. పట్టిక ప్రకారం ఇడ్లీ, సాంబారు పెట్టాల్సి ఉన్నా.. వంటపాత్రలు లేక ఉప్మా, సాంబారు పెట్టాల్సి వచ్చిందని హెచ్ఎం గంగన్న తెలిపారు.

వంట చేయకపోవడంతో..

జైనథ్ మండలం సావాపూర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం అల్పాహారం అమలు చేయాల్సి ఉండగా.. అక్కడి నిర్వాహకులు చేతులెత్తేయడంతో చివరకు పెండల్‌వాడ దాజీనగర్ ప్రాథమిక పాఠశాలలో హడావుడిగా ఆలస్యంగా అల్పాహారం వండిపెట్టాల్సి వచ్చింది. ఈ పాఠశాలలో 36 మందికి 31 మంది విద్యార్థులు హాజరై అల్పాహారం భుజించారు.

అప్పు చేసి..ఇంద్రవెల్లి: ఉదయం 9 గంటలకు అందించాల్సిన అల్పాహారాన్ని 10.30 గంటలకు అందించారు. మామిడిగూడ ఎంపీపీఎస్ పాఠశాల లో 32 మంది విద్యార్థులున్నారు. మారుమూల గిరిజన గ్రామం కావటంతో అల్పాహారానికి అవసరమైన సరకులు అందుబాటులో లేక మధ్యాహ్న భోజన కార్మికురాలు రుక్మాబాయి ముందురోజు మండల కేంద్రానికి వెళ్లి ఉప్మా రవ్వ ప్యాకెట్లను తీసుకొచ్చారు. గత జూన్ నుంచి వేతనాలు రాలేదని, అప్పు చేసి సరకులు తీసుకువచ్చానని వాపోయారు.సంఖ్య తేలక.. సమయానికి అందకఉట్నూరు మండలం లక్కారం ప్రాథమిక పాఠశాలలో సెలవుల తర్వాత బడి ప్రారంభించడంతో విద్యార్థుల సంఖ్య తేలక సరైన సమయానికి విద్యార్థులకు అల్పాహారం అందించ లేకపోయారు. 23 మందికి నలుగురే హాజరయ్యారు. వారికి ఉప్మా వండి పెట్టారు.

## నిర్వహణలోపం.. బాధితులకు శాపం

మంచిర్యాల : జిల్లా కేంద్రానికి చెందిన ఈయన పేరు పురుషోత్తం. వారానికి మూడుసార్లు ఇక్కడి కేంద్రంలో రక్తశుద్ధి చికిత్స పొందుతుంటారు. ప్రస్తుతం అందుతున్న సేవలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. డయాలసిస్ ప్రక్రియ సక్రమంగా జరగడం లేదని చెబుతున్నారు. గతంలో రక్తశుద్ధి, రక్తం స్వీకరణ ఒకే చోట జరగగా.. ప్రస్తుతం రెండింటికీ వేర్వేరు చోట్లకు వెళ్లాల్సి వస్తుందంటున్నారు.
నాలుగు గంటలపాటు యాతన పడుతూ రక్తశుద్ధి చేయించుకుంటున్న మూత్రపిండాల వ్యాధిగ్రస్థులు మరింత అవస్థలు పడుతున్నారు. డయాలసిస్ కేంద్రంలో మెరుగైన సేవలందించాల్సిందిపోయి చికిత్సలో నిర్లక్ష్యం చేస్తున్నారు. గతంలో చాలీచాలని పడకలతో 24 గంటలపాటు ఐదు షిఫ్టుల్లో సేవలందించగా ప్రస్తుతం కొనసాగుతున్న మూడు, ఒక్కోసారి నాలుగు షిఫ్టులకే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన నిర్వహణ సంస్థతో కేంద్రం మెరుగుపడుతుందని ఆశించిన బాధితులకు మరింత సమస్యగా మారిందనే ఆరోపణలు వస్తున్నాయి. పర్యవేక్షణ చేయాల్సిన పెద్దాసుపత్రి నిర్వాహకుల పట్టింపులేనితనం విమర్శలకు దారి తీస్తోంది.

పర్యవేక్షణ కరవు..ఆరేళ్ల కిందట అప్పటి జిల్లా ఆసుపత్రిలో ఆవరణలో రక్తశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఐదు పడకల సామర్థ్యం ఉండగా ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వ్యాధిగ్రస్థులకే చికిత్స అందించేలా ప్రభుత్వం డీ-మేడ్ అనే జర్మనీ సంస్థకు నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. కేంద్రానికి భవనం, నీరు, విద్యుత్తు సౌకర్యంతోపాటు వైద్యులను సమకూర్చడం పెద్దాసుపత్రి బాధ్యత. ఇందుకు ఆరోగ్యశ్రీ ట్రస్టు నుంచి వచ్చే ఆదాయంలో కొంత మొత్తాన్ని ఆ సంస్థ ఆసుపత్రికి ఇస్తుంది. ఐదు పడకలతో మొదలైన ఈ కేంద్రం వ్యాధిగ్రస్థుల తీవ్రతతో మరో ఐదు పడకలను మంజూరు చేసి ఉన్నతీకరించారు. జీజీహెచ్‌గా మారకముందు వరకు అప్పటి పర్యవేక్షకులు వైద్యులకు ఈ కేంద్రానికి విధులు కేటాయించారు. కానీ ప్రస్తుతం వైద్యులు ఈ వైపే చూడకపోవడంతో బాధితులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏ సమస్య వచ్చినా సంస్థకు సంబంధించిన వైద్యుడిని ఆన్‌లైన్ ద్వారా సంప్రదించాల్సి వస్తుందని కొందరు వ్యాధిగ్రస్థులు చెబుతున్నారు. ట్యాంకులో నీళ్లు అయిపోయాయని సమాచారం అందించినా స్పందించడం లేదంటున్నారు.డీ-మేడ్ నుంచి అపెక్స్‌కు..ఇక్కడి రక్తశుద్ధి కేంద్రానికి దాదాపు ఐదేళ్లకుపైగా నిర్వహించిన డీ-మేడ్ సంస్థ బాధ్యతల నుంచి తప్పుకోగా ఇటీవల అపెక్స్ చేపట్టింది. గతంలో పలు సమస్యలతో ఇబ్బందిపడగా ఈ నూతన సంస్థతో వ్యాధిగ్రస్థులకు సమస్యలు ఎక్కువయ్యాయి. రక్తశుద్ధితోపాటు అవసరమైన వారికి రక్తాన్ని సైతం ఎక్కించాల్సి ఉంటుంది. గతంలో ఈ కేంద్రంలో సంబంధిత సేవలు అందించగా ప్రస్తుతం పూర్తిగా నిలిపివేసింది. ఆసుపత్రిలో రెడ్‌క్రాస్ సొసైటీ రక్తం ఇచ్చేందుకు సిద్ధంగా ఉంటున్నా.. అపెక్స్ సంస్థ మాత్రం ఇందుకు అంగీకరించడం లేదు. దీంతో రక్తశుద్ధి ఓ చోట, రక్తం స్వీకరించడం మరో చోట చేస్తుండటంతో బాధితులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

# జనగామ రైల్వేస్టేషన్‌కు కొత్త హంగులు



జనగామ : మున్సిపల్ పట్టణంగా, రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న జనగామ ఏడేళ్ల క్రితం జిల్లా కేంద్రంగా ఆవిర్భవించింది. జిల్లా కేంద్రానికి ప్రతి రోజూ వివిధ మండలాల ప్రజల రాకపోకలతో పట్టణం నిత్యం రద్దీగా ఉంటోంది. రోడ్డు, రైల్వే మార్గాల ప్రకారం దేశంలోని ఉత్తర, దక్షిణ ప్రాంతాలకు జనగామ వారధిగా ఉంది. రహదారులు, రైల్వేలైన్లు, పట్టణీకరణతో పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. దేశవ్యాప్తంగా రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ కోసం ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకానికి ఎంపికైన స్టేషన్లలో జనగామ స్టేషన్ కూడా ఉంది. ఇటీవలే భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రైల్వే శాఖ ఉన్నతాధికారులు జనగామ రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నెల రోజుల క్రితం అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి.

రూ. 25 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం

రైల్వేస్టేషన్‌లో రూ. 25 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించారు. రైల్వేస్టేషన్ ఆవరణలో ప్రయాణికుల ఆహ్లాదం కోసం గార్డెనింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే సుందరీకరణ పనులు ప్రారంభమయ్యాయి. స్టేషన్ లోపల మొదటి, రెండో ప్లాట్‌ఫామ్‌లపై అదనపు ప్లాట్‌ఫాంలను నిర్మిస్తున్నారు. ఈ పనులు కూడా ప్రారంభించారు. గతంలో ప్లాట్‌ఫాంలపై ఉన్న రేకుల షెడ్లు సరిగ్గా లేకపోవడంతో కొత్త షెడ్లు నిర్మిస్తున్నారు. జనగామ పట్టణం స్టేషన్‌కు రెండు వైపులా విస్తరించి ఉంటుంది. స్టేషన్ నుంచే పట్టణ ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఎంతో కాలంగా ప్రజలు కోరుతున్నట్లుగా స్టేషన్ ముందుభాగం నుంచి రెండో ప్లాట్‌ఫాం బయటకు నడిచేందుకు వీలుగా నూతనంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించనున్నారు. వంతెన నిర్మాణ పనులు త్వరలో మొదలు కానున్నాయి. నూతనంగా రైల్వే పోలీస్ స్టేషన్‌ను నిర్మించనున్నారు. బుకింగ్ కౌంటర్ విభాగాన్ని కూడా అత్యాధునికంగా నిర్మించనున్నారు. ప్రయాణికులు వేచి ఉంటే హాళ్లను అత్యాధునికంగా తీర్చిదిద్దేందుకు సిద్ధం చేస్తున్నారు. స్టేషన్‌లో ప్రయాణికుల కోసం ఎస్కలేటర్ సౌకర్యం కల్పిస్తారు. ఈ పనులన్నీ మరికొద్ది నెలల్లో పూర్తయితే అత్యాధునిక సౌకర్యాలతో రైల్వే స్టేషన్ కొత్త హంగులు సంతరించుకోనుంది.

రైళ్ల హాల్టింగ్‌పై దృష్టి పెట్టాలి

జనగామ రైల్వేస్టేషన్‌లో కోణార్క్, శాతవాహన, చార్మినార్, షిర్డీ, సింహపురి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని ఎంతో కాలంగా ప్రయాణికులు కోరుతున్నారు. జనగామ వ్యాపార, వాణిజ్య పరంగా వేగంగా అభివృద్ధి చెందుతుండటంతో మరిన్ని సూపర్‌ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఇక్కడ నిలపాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. యాదాద్రి జిల్లా రాయగిరి వరకు ఎంఎంటీఎస్ రైళ్లను పొడిగించనున్నారు. జనగామ వరకు వీటిని నడపాలని రైల్వే ఉన్నతాధికారులు ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఎంఎంటీఎస్ రైళ్లు జనగామ వరకు నడిస్తే సికింద్రాబాద్, హైదరాబాద్ నగరాలకు ఈ ప్రాంత ప్రజలు వెళ్లేందుకు మరింత సౌకర్యంగా ఉంటుంది.

అమృత్ భారత్ పథకం వరం- మహంకాళి హరిశ్చంద్రగుప్త, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడుజనగామ రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ పథకంలో చేర్చడం వరమనే చెప్పాలి. రైల్వేస్టేషన్ రూపురేఖలనే మార్చేలా కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టడం హర్షణీయం. జనగామలో ప్రయాణికులు కోరుతున్న విధంగా సూపర్‌ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా ఆపేలా రైల్వే ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి.

# ర్యాంపులు లేవు.. విద్యుత్తు సౌకర్యం అంతంతే



సిరిసిల్ల : అసెంబ్లీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఎన్నికల నిర్వహణపై సంబంధిత అధికారులకు అవగాహన కల్పించారు. పోలింగ్ సమయంలో ఎదురయ్యే సమస్యలను వివరిస్తూ వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. అయితే పోలింగ్ కేంద్రాల్లోని సౌకర్యాలపై అధికారులు దృష్టిసారించడం లేదు. ఓటర్ల సమస్యలను గాలికి వదిలేశారు. దీంతో గత ఎన్నికల్లో మాదిరిగానే ఈ దఫా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై పరిశీలన చేసింది. ముఖ్యంగా పల్లెల్లో విద్యుత్తు సౌకర్యం, శౌచాలయాలు వంటివి లేవు. కొన్ని చోట్ల ర్యాంపులు కనిపించడం లేదు. అధికార యంత్రాంగం ఇప్పటి నుంచే వసతుల కల్పనకు దృష్టిసారిస్తే ఓటర్లకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ఆ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

తప్పని దూరాభారం

మండలంలోని 30 గ్రామాల్లో 50 పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించారు. అందులో ఇప్పటి వరకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. కస్బెకట్కూర్ ప్రభుత్వ పాఠశాలలో గతంలో కట్టిన ర్యాంపు ఉంది. గడ్డి, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. ఈ పోలింగ్ కేంద్రంలో బోరు ఉన్నప్పటికీ అందులో నీరు లేకపోవడంతో గ్రామ పంచాయతీ పైపులైన్ వేసినా ఇబ్బంది తప్పడం లేదు. విద్యుత్తు దీపాలు లేవు. పంచాయతీ పరిధిలోని చింతలపల్లి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడ పోలింగ్ కేంద్రం లేదు. సుమారు 150 మంది ఓటర్లు కస్బెకట్కూర్‌కే వచ్చి ఓటు వేయాల్సి ఉంది. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వీరికి దూరాభారం తప్పడం లేదు. గోపాల్‌రావుపల్లె పరిధిలోని బెంద్రంపల్లె, అంకుసాపూర్ పరిధిలోని ఇందిరానగర్ శివారు గ్రామాల వారికి ఇదే పరిస్థితి ఎదురవుతుంది.

గదుల్లో చీకటి

మండలంలోని నర్మాల ప్రాథమికోన్నత పాఠశాలలోని రెండు గదుల్లో పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. దివ్యాంగులు వెళ్లి ఓటు వేయడానికి ర్యాంపులు ఏర్పాటు చేయలేదు. విద్యుత్తు సౌకర్యం అస్తవ్యస్తంగా ఉంది. రెండు గదుల్లో వెలుతురు లేదు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

ఖీమ్యానాయక్, జిల్లా అదనపు కలెక్టర్

పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లతో పాటు పోలింగ్ నిర్వహణకు ఇబ్బంది లేకుండా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రతి కేంద్రంలో విద్యుత్తు సౌకర్యంతో పాటు మంచి నీరు, ర్యాంపులు, మహిళలు, పురుషులకు వేర్వేరుగా శౌచాలయాలు ఏర్పాటు చేశాం. దివ్యాంగులు, వృద్ధులకు వీల్‌ఛైర్లు ఉన్నాయి. ఓటర్లకు సహాయం చేయడానికి బూత్ లెవల్ అధికారులతో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఏమైనా సౌకర్యాలు లేకుంట్టే ఆ మండలానికి చెందిన తహసీల్దార్లతో ఏర్పాట్లు చేయిస్తున్నాం.

తీగలు తెగినా...

బోయినపల్లి: మండలంలోని 23 గ్రామాల్లో 41 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఆయా కేంద్రాల్లో వెలుతురు సరిగా ఉండే విధంగా విద్యుత్తు సదుపాయంతోపాటు ఓటర్లకు తాగు నీరు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ర్యాంప్‌ల నిర్మాణంపై దృష్టిసారిస్తున్నారు. తడగొండలోని పోలింగ్ కేంద్రం 187లో విద్యుత్తు సదుపాయం లేదు. వైర్లు తెగిపోవడంతో ఫ్యాన్ తిరగడం లేదు. బల్బులు వెలగడం లేదు. తాగు నీటి సదుపాయం కల్పించాల్సి ఉంది.

రెండు గ్రామాలకు ఒకచోటే

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే: వేములవాడ గ్రామీణ మండలంలో 24 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. వాటిలో కనీస సౌకర్యాలు లేవు. నాగయ్యపల్లి, పోచెట్టిపల్లి గ్రామాలకు నాగయ్యపల్లి పంచాయతీ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. దివ్యాంగులు, వృద్ధులు ఓటు వేయడానికి వెళ్లేందుకు ర్యాంపుల నిర్మాణం చేపట్టలేదు. తుర్కాశినగర్, నమిలిగుండుపల్లి, బాలరాజుపల్లి కేంద్రాల్లో శౌచాలయాలు లేవు.

రెయిలింగ్ కట్టక...మండలంలో 50 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. పలు చోట్ల సరైన వసతులు లేవు. మండల కేంద్రంలోని వృద్ధుల డే కేర్ కేంద్రంతోపాటు నారాయణపూర్‌లో గ్రామ పంచాయతీ కార్యాలయ భవనంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వివిధ పాఠశాలల్లో ర్యాంప్‌లు, రెయిలింగ్‌లు, తాగునీటి వసతిని కల్పించలేదు. ఎల్లారెడ్డిపేట అంబేద్కర్‌నగర్ ప్రాథమికోన్నత పాఠశాల, బుగ్గరాజేశ్వర తండా ప్రాథమిక పాఠశాలలో ర్యాంపులను నిర్మించలేదు. రాచర్ల గొల్లపల్లిలోని వసతి గృహంలో ర్యాంపు, రెయిలింగ్ సౌకర్యం లేదు.

# యూడైస్‌లో పేరుంటేనే పది పరీక్షలకు అర్హులు

నిజామాబాద్ : విద్యార్థుల వివరాలు పక్కాగా ఉండేలా పాఠశాల విద్యాశాఖ చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా యూడైస్(యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్)లో పేరు నమోదైన వారినే పదో తరగతి పరీక్షలకు అనుమతించేలా విద్యాశాఖ రాష్ట్ర సంచాలకురాలు శ్రీదేవసేన జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పొరపాట్లకు అడ్డుకట్ట వేసేందుకు, వారి సమాచారం పూర్తిస్థాయిలో తెలుసుకునేందుకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.

అనుమతిలేని వాటిని అడ్డుకోవడానికి..

కొన్ని విద్యాలయాలు అనుమతులు లేకున్నా పదో తరగతి వరకు ప్రవేశాలను తీసుకొని విద్యాభ్యాసం కొనసాగిస్తున్నాయి. తీరా పరీక్షల సమయంలో ఆయా విద్యాలయాల యాజమాన్యాలు ఇతర పాఠశాలల్లో పేర్లు నమోదు చేయించి పరీక్షలు రాయిస్తున్నారు. పరీక్ష ఫీజు చెల్లించిన తర్వాత ఆయా పాఠశాలలు ప్రభుత్వ పరీక్షల విభాగానికి విద్యార్థుల పేర్లు, ఇతర సమగ్ర వివరాలతో కూడిన నామినల్ రోల్స్ పంపించేవారు. తాజా ఉత్తర్వుల ప్రకారం విద్యార్థుల సంఖ్యను పక్కాగా



తెలియజేసేందుకు ఇక నుంచి యూడైస్‌లో పేరు నమోదై ఉంటేనే పదో తరగతి పరీక్షలకు అనుమతి ఇవ్వనున్నారు.

ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో..

యూడైస్‌లో విద్యార్థుల వివరాలు చాలా వరకు పూర్తి చేశారు. మిగిలిన వివరాలు అప్‌డేట్ చేయడానికి ఈ నెల 28వ తేదీ వరకు అధికారులు గడువిచ్చారు. ఇందు కోసం ప్రత్యేకంగా ఓ నమూనా సిద్ధం చేశారు. అన్ని వివరాలతో కూడిన ఆన్‌లైన్ ఫాంను సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో భర్తీ చేయాల్సి ఉంటుంది. దీంతో సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి కచ్చితమైన ప్రణాళికతో పాటు ప్రైవేటు బడుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలనేది లక్ష్యం. యూడైస్‌లో విద్యార్థి 1వ తరగతి నుంచి రికార్డు అందుబాటులో ఉంటుంది. 9వ తరగతి వరకు సదరు విద్యార్థి పేరు ఆన్‌లైన్లో నమోదు కాకపోతే యూడైస్‌లోకి చేర్చే అవకాశం ఉండదు.

లోపాలు అధిగమించాలి ఇప్పటి వరకు విద్యార్థి ఎక్కడ చదివినా అందుకు సంబంధించిన టీసీ లేకుండానే ఆరో తరగతి వరకు చేర్చుకునే వీలుంది. యూడైస్ డేటా కొలమానంగా తీసుకుంటే విద్యార్థి గత తరగతుల వివరాలు లేకుంటే ప్రభుత్వ బడుల్లోనూ ప్రవేశం కల్పించే వీలుకాదని, ఇలాంటి లోపాలు అధిగమించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

## చారిత్రక కోట.. బోథ్ అడ్డా!

ఇచ్చోడ : బోథ్ అసెంబ్లీ నియోజకవర్గం 1962లో ఏర్పడింది. ఇప్పటి వరకు 13 పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. మొదట్లో జనరల్‌గా ఉన్న ఈ స్థానాన్ని 1967 నుంచి గిరిజనులకు(ఎస్టీ) రిజర్వ్ చేశారు. నియోజకవర్గంలో బోథ్, నేరడిగొండ, బజార్‌హత్నూర్, ఇచ్చోడ, గుడిహత్నూర్, తాంసి, తలమడుగు, సిరికొండ, భీంపూర్ మండలాలు ఉన్నాయి. ఇటీవల సొనాలను నూతన మండలంగా ఏర్పాటు చేశారు. 2009 ఎన్నికలకు ముందు నియోజకవర్గాల పునర్విభజన నిర్వహించగా ఆదిలాబాద్ నియోజకవర్గంలోని తాంసి, తలమడుగు మండలాలను బోథ్‌లో కలిపారు. అంతకు ముందు బోథ్ నియోజకవర్గంలో నార్నూర్, ఇంద్రవెల్లి మండలాలు ఉండగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో నార్నూర్‌ను, ఖానాపూర్ నియోజకవర్గంలో ఇంద్రవెల్లి మండలాన్ని కలిపారు. నియోజకవర్గంలో గిరిజనులకు రిజర్వ్‌డ్ అయినా గిరిజనేతర ఓట్లే ఇక్కడ కీలకం. బోథ్ నియోజకవర్గంలో వ్యవసాయమే ఆధారం. ఇక్కడ జలవనరులు ఉన్నా ప్రాజెక్టుల నిర్మాణం లేక రైతులు వర్షాధారిత పంటలపైనే ఆధారపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న చిన్న తరహా ప్రాజెక్టులు తాంసి మండలం మత్తడివాగు, సిరికొండ మండలం చిక్‌మాన్ ప్రాజెక్ట్, బోథ్ మండలం కరత్వాడ ప్రాజెక్ట్‌లే దిక్కు. నేరడిగొండలో కుప్టి వంతెన నిర్మాణం చేపడతామని ప్రభుత్వం చెప్పినా ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైంది. పత్తి, సోయా, టమాట పంటలు సాగు చేస్తారు.

నాటి ఆనవాళ్లు..బోథ్ నియోజకవర్గంలో చారిత్రక ఆనవాళ్లకు కొదువలేదు. కాకతీయులు, ఇక్ష్వాకులు ఈ ప్రాంతాన్ని పాలించిన ఆనవాళ్లు కనిపిస్తాయి. ఇచ్చోడ మండలం సిరిచెల్మ మల్లికార్జున ఆలయం, నేరడిగొండ మండలం వడూర్, ఇచ్చోడ మండలం కామగిరిలో ఇక్ష్వాకుల కాలం నాటి శిలాశాసనాలు, గుడిహత్నూర్ మండలం రామాలయం, బజార్‌హత్నూర్ మండలం కనకాయి, నేరడిగొండ మండలం కుంటాల జలపాతంలో సోమేశ్వర స్వామి, సిరికొండ, సొనాల, దర్బా గ్రామాలు ప్రాచీన చరిత్రకు నిలయాలు.

పర్యాటక ప్రదేశాలు

బోథ్ నియోజకవర్గం పర్యాటక కేంద్రాలకు నెలవు. రాష్ట్రంలో ఎత్తయిన జలపాతం కుంటాల ఈ నియోజకవర్గంలోనే ఉంది. బోథ్ మండలం పొచ్చెర, ఇచ్చోడ మండలం గాయత్రి జలపాతాలు ఆకట్టుకుంటాయి.

పరిశ్రమల జాడ లేదు

ఇప్పటి వరకు పరిశ్రమల స్థాపన జరగలేదు. పత్తి, సోయాతో పాటు టమాట సాగు ఎక్కువగా ఉంటుంది. గతంలో కాంగ్రెస్ హయాంలో టమాట జ్యూస్ పరిశ్రమ ఏర్పాటుకు హామీ ఇచ్చిన నేటికీ నెరవేరలేదు. నిరుద్యోగ యువతకు సరైన ఉపాధి అవకాశాలు లేక ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.

ఆ మూడు పార్టీలే

ఇప్పటి వరకు 13 సార్లు ఎన్నికలు జరగగా, కాంగ్రెస్, తెదేపా, తెరాస పార్టీ గెలుపొందాయి. 1962లో కాంగ్రెస్ పార్టీ నుంచి మాధవరెడ్డి గెలుపొందారు. 1967, 1972, 1978, 1983లో వరుసగా హస్తం పార్టీ పాగా వేసింది. 1985లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గోడం రామారావు తెదేపా నుంచి పోటీ చేసి గెలుపొందారు. 1989లోనూ ఆయనే విజయం సాధించారు. 1994లో ఆయన తనయుడు నగేశ్ ఉపాధ్యాయ వృత్తి నుంచి రాజకీయ రంగంలోకి రాగా, తెదేపా నుంచి గెలుపొందారు. 1999లోనూ విజయం సాధించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న సోయం బాపురావు 2004లో తెరాస నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2009లో గోడం నగేశ్ తెదేపా నుంచి పోటీ చేసి గెలుపొందారు.ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుతో తెరాస నుంచి పోటీ చేసిన రాథోడ్ బాపురావు 2014, 2018లో గెలుపొందారు.




వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఉత్తర ద్వార దర్శనం చేసుకోవడం కోసం భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు పోటెత్తారు. తెలుగురాష్ట్రాల్లోని తిరుమల, భద్రాద్రి, వేములవాడ, యాదాద్రి తదితర పుణ్యక్షేత్రాల్లో భారీ సంఖ్యలో భక్తులు బారులు తీరారు.


# జిల్లా పారిశ్రామిక ప్రగతికి మైలురాయి.. సెంచరీ పరిశ్రమ..!

## రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి



బద్వేలు : బద్వేలు నియోజకవర్గంలో ఏర్పాటైన సెంచరీ పరిశ్రమ.. జిల్లా పారిశ్రామిక ప్రగతికి మరో మైలురాయి అని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అభివర్ణించారు. శనివారం ఉదయం గోపవరం మండల పరిధిలోని ఇండస్ట్రియల్ పార్క్ లో నూతనంగా నిర్మించిన సెంచరీ ప్యానెల్స్ లిమిటెడ్ (సీపీఎల్) పరిశ్రమ ఉత్పత్తి యూనిట్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించి,శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం లాంజ్ రూమ్ లో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి సెంచరీ ప్లై కంపెనీకి సంబంధించిన వీడియోను తిలకించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో.. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా,ఎంపీ అవినాష్ రెడ్డి,బద్వేలు ఎమ్మెల్యే డా. దాసరి సుధ, అడా చైర్మన్ గురుమోహన్,ఫుడ్ కమిషన్ ఛైర్మెన్ విజయ ప్రతాప్ రెడ్డి, ఎమ్మెల్సీ డిసి గోవింద రెడ్డి,సెంచూరీ ప్లై వుడ్ ఛైర్మెన్ సజ్జన్ బజంకా,మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ అగర్వాల్,ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ కేశన్ బజంకా, ప్రెసిడెంట్ హిమన్షు,వైస్ ప్రెసిడెంట్ తుషార్ పట్నాయక్,ఎక్జిక్యూటివ్ అసిస్టెంట్ అంకిత్ బంటియా అధికారులు...జిల్లా కలెక్టర్ విజయ్ రామరాజు,జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ లు పాల్గొన్నారు. బద్వేలు నియోజకవర్గ కేంద్రానికి సమీపంలో గోపవరం మండల పరిధిలో ఏర్పాటైన ఇండస్ట్రియల్ పార్కులో.. అన్ని మౌలిక సదుపాయాలతో సహా ఎకరా రూ.15 లక్షల రాయితీ ధరతో ఏపీఐఐసి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 100 ఎకరాల విస్తీర్ణంలో సెంచరీ ప్యానెల్స్ లిమిటెడ్ (సీపీఎల్) పరిశ్రమ ఏర్పాటయింది. రూ.956.00 కోట్ల మేర పెట్టుబడితో రూపుదిద్దుకున్న ఈ సీపీఎల్ పరిశ్రమలో.. మీడియం డెన్సిటీ ఫైబర్ బోర్డ్, హై ప్రెజర్ లామినేట్స్ ఉత్పత్తిని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. కాగా చెక్క పలకలు, అలంకరణ సంబంధ వుడ్ షీట్స్ తయారీలో దేశంలోనే ప్రసిద్ధిగాంచిన సెంచరీ ప్యానెల్స్ లిమిటెడ్ సంస్థ.. 2266 మందికి పైగా ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా.. ఈ ప్రాంతంలో ఏర్పాటయింది. అంతేకాకుండా స్వలాభం కోసమే కాకుండా బద్వేలు నియోజకవర్గ పరిసర ప్రాంత రైతులకు లబ్ది చేకూర్చేలా కంపెనీ ఉత్పత్తికి అవసరమైన ముడి సరుకును.. రైతుల నుండే నేరుగా కొనుగోలు చేస్తోంది. భవిష్య అవసరాల కొరతను తీర్చేందుకు గాను.. ఈ కంపెనీ ద్వారా రానున్న 8 ఏళ్లలో 80,000 ఎకరాల భూమిలో చెట్లను పెంచేందుకు స్థానిక రైతులను ప్రోత్సహిస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే.. 1000 మంది రైతులకు సబంధించి 5000 ఎకరాల్లో రాయితీ ధరతో చెట్లను నాటడానికి అవకాశం కల్పించారు. సీపీఎల్ పరిశ్రమకు నీటి అవసరాలకు గాను.. ప్రభుత్వం బ్రహ్మం సాగర్ రిజర్వాయర్ నుండి 0.07 టీఎంసీల నీటిని కూడా కేటాయించారు. అందుకోసం.. రిజర్వాయర్ నుండి ప్లాంట్ సైట్ వరకు రూ.45 కోట్లతో వాటర్ పైప్ లైన్ కూడా ఏర్పాటు చేశారు. అంతేకాకుండా నిరంతారాయ విద్యుత్ సరఫరా కోసం ఏపీ ఐఐసి ద్వారా రూ.19.11 కోట్లు వెచ్చించి 132 కెవి విద్యుత్ లైన్ ను ఏర్పాటు చేసింది.

# జనవరి 6న గమ్యస్థానానికి ఆదిత్య ఎల్1: ఇస్రో ఛైర్మన్



దిల్లీ: సూర్యుడిని అధ్యయనం చేసేందుకు ఉద్దేశించిన 'ఆదిత్య ఎల్1' తన ప్రయాణంలో తుది అంకానికి సమీపించింది. జనవరి 6 తన గమ్యస్థానానికి చేరుకోనుంది. ఈ మేరకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఛైర్మన్ ఎస్.సోమనాథ్ వెల్లడించారు. ఓ ఎన్జీఓ నిర్వహించిన భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో భాగంగా మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. 'ఆదిత్య ఎల్1 జనవరి 6వ తేదీన ఎల్1(లగ్రాంజ్ పాయింట్-1) పాయింట్‌లోకి ప్రవేశిస్తుందని మేం అంచనా వేస్తున్నాం. దీనికి సంబంధించిన కచ్చితమైన వివరాలను తగిన సమయంలో వెల్లడిస్తాం' అని తెలిపారు. 'ఈ స్పేస్‌క్రాఫ్ట్ ఎల్1 పాయింట్‌కు చేరుకున్న తర్వాత మరోసారి ఇంజిన్‌ను మండిస్తాం. తర్వాత ఈ వ్యోమనౌక ఎల్1 కేంద్రంలో స్థిరపడుతుంది. అది విజయవంతంగా ఆ పాయింట్ వద్దకు చేరుకున్న తర్వాత అక్కడే కక్ష్యలో తిరుగుతూ ఉంటుంది. ఐదేళ్లపాటు భారత్ సహా ప్రపంచ దేశాలకు ఉపకరించే సమాచారాన్ని సేకరిస్తుంది.

సూర్యుడిలో వచ్చే మార్పులు, అవి మానవ జీవనంపై చూపే ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి ఆ సమాచారం ఉపయోగపడుతుంది' అని ఇస్రో ఛైర్మన్ వెల్లడించారు. అలాగే భారత స్పేస్ స్టేషన్‌ను నిర్మించేందుకు ఇస్రో ఇప్పటికే ప్రణాళికను సిద్ధం చేసిందని చెప్పారు. సౌర వాతావరణాన్ని లోతుగా అధ్యయనం చేయడం 'ఆదిత్య ఎల్1' లక్ష్యం. భారత్ తరఫున సూర్యుడిని పరిశోధించేందుకు ఇస్రో చేపట్టిన తొలి మిషన్ ఇదే. భూమి నుంచి 15 లక్షల కి.మీ దూరంలో ఉన్న లగ్రాంజ్ పాయింట్-1కు చేరాక.. దాని కక్ష్యలో పరిభ్రమిస్తూ అధ్యయనం మొదలుపెడుతుంది. ఈ వ్యోమనౌక మొత్తం ఏడు పేలోడ్లను మోసుకెళ్లింది. సౌర వాతావరణం, సౌర జ్వాలలు, కరోనల్ మాస్ ఎజెక్షన్ తదితర విషయాలను అధ్యయనం చేసేందుకు ఇవి కీలకమైన సమాచారాన్ని అందించనున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 2వ తేదీన ఈ ప్రయోగాన్ని చేపట్టారు.

# జగన్‌ను ఎదుర్కోవాలంటే ఏపీలో అన్ని పార్టీలు కలవాలి




ఢిల్లీ: ఏపీలో పార్టీలు అన్నీ కేంద్ర హోంమంత్రిని, బీజేపీని చూసి భయపడుతున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ఏపీలో రాజకీయ పరిస్థితులు అనిశ్చితంగా ఉన్నాయని, జగన్‌ను ఎదుర్కోవాలంటే ఏపీలో అన్ని పార్టీలు కలవాలని ఆయన సూచించారు. మోడీని వ్యతిరేకిస్తే తమకు ఎక్కడ ఇబ్బందులు సృష్టిస్తారో అని వారంతా భయపడుతున్నారని, ఇండియా కూటమికి అనుకూలంగా ఉండేవారితోనే మా పొత్తులు ఉంటాయని నారాయణ స్పష్టం చేశారు. "బీజేపీ వల్ల రెండు తెలుగు రాష్ట్రాలు నష్టపోయాయి. ప్రత్యేక హోదా సహా ఏదీ రాలేదు. తెలుగు రాష్ట్రాలకు అన్యాయం చేసిన పార్టీ ఏదైనా ఉందంటే అది బీజేపీయే. వారితో అంటకాగే పార్టీలకు కూడా ప్రజలు ఓటు వేయరు. జగన్‌కు వ్యతిరేకంగా టీడీపీ, జనసేన, కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు కలిసి వెళ్ళాలి అన్నది మా ఉద్దేశం. టీడీపీని ఇండియా కూటమిలోకి ఆహ్వానిస్తున్నాం. పోల్ మేనేజ్‌మెంట్‌కు భయపడి వారు బీజేపీ పొత్తు కోసం ఆరాటపడుతున్నారు. భారతదేశ చరిత్రలో ఇంత మంది ఎంపీలను సస్పెండ్ చేసిన ఘటన గతంలో ఎప్పుడూ లేదు. వారు చేసిన తప్పేంటి? పార్లమెంట్‌పై దాడి ఘటనపై చర్చకు పట్టుబట్టారు. ఒకవేళ ఏదైనా జరిగితే సభ్యులు చనిపోయేవారు కదా?. బీజేపీ ఎంపీ పాస్ ఇవ్వడం నిజమా కాదా?. పొరపాటున ఏ %వీ×వీ% ఎంపీ ఇచ్చి ఉంటే ఏం చేసేవారు?. పార్లమెంట్ నే కాపాడలేని అసమర్ధులు భారతదేశాన్ని ఎలా కాపాడతారు?. ఇది ఉద్దేశపూర్వకంగా జరిగింది అని నా అనుమానం. ఎన్నికల్లో లబ్ధి కోసం చేసిన నాటకీయ ప్రక్రియ అనిపిస్తోంది. లేదంటే ఎంత సీరియస్‌గా వ్యవహరించాలి?. అటువంటిదేమీ కనిపించడం లేదే?. ఎన్నికల జిమ్మిక్‌లో భాగంగానే ప్రమాదకర గేమ్ ఆడారు. ఇండియా కూటమికి దేశంలో జనాదరణ పెరుగుతుంది కాబట్టి ఇలా చేస్తున్నారు. రామజన్మభూమి ఆలయానికి వ్యూహాత్మకంగా అందరినీ పిలిచారు. బాబ్రీ మసీదు కూలగొట్టడానికి ఆద్యుడు ఎల్‌కే అద్వానీ. కానీ ఆయన్ను రానివ్వడం లేదు. ఆయనొస్తే పేరు ఆయనకే వెళ్తుంది. అది మోడీకి ఇష్టం లేదు. అందుకే అద్వానీ, మురళీ మనోహర్ జోషికి ఆహ్వానం లేదు. ఉపరాష్ట్రపతిని మిమిక్రీ చేశామని గోల చేస్తున్నారు. అది ఒక కళ. ఇండియా కూటమి పొత్తులు తెలంగాణలో విజయం సాధించాయి." అని నారాయణ అన్నారు.




అమరావతి: ఎన్ఆర్ఐ తెదేపా కార్యకర్త యశస్వి (యష్) బొద్దులూరి అరెస్టును తెదేపా నేతలు ఖండించారు. అరెస్టుకు నిరసనగా గుంటూరు సీఐడీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉగ్రవాదిని హింసించినట్లు యష్‌తో సీఐడీ వ్యవహరించడం దుర్మార్గమని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ విమర్శించారు.

"యష్ అరెస్టును ఖండిస్తున్నా. ప్రశ్నించే గొంతులను నిర్బంధాల ద్వారా అణిచివేయాలని వైకాపా ప్రభుత్వం అనుకుంటోంది. న్యాయం జరిగే వరకు విశ్రమించబోము. వైకాపాకి చివరి రోజులు దగ్గర పడ్డాయి" అని లోకేశ్ మండిపడ్డారు. యష్‌ను అరెస్టు చేయడం సైకోయిజానికి నిదర్శనమని ఏపీ తెదేపా అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. యష్ భద్రతపై ముఖ్యమంత్రి బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వ తప్పులు, అవినీతిని ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా? అని ప్రశ్నించారు. " స్వేచ్ఛగా అభిప్రాయాన్ని వెల్లడించే హక్కు లేదా?జగన్ నియంతృత్వ పోకడలకు మూల్యం చెల్లించక తప్పదు" అని అన్నారు. అక్రమ అరెస్టులతో అణిచివేయాలని చూస్తున్నారని చింతకాయల అయ్యన్న పాత్రుడు విమర్శించారు. వైకాపా ప్రభుత్వం కూలిపోవడం ఖాయమన్నారు. యశస్విని ఏపీ సీఐడీ పోలీసులు శనివారం ఉదయం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అనారోగ్యంతో బాధపడుతున్న తన తల్లిని పరామర్శించేందుకు వచ్చిన ఆయన్ని శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకొని గుంటూరు సీఐడీ కార్యాలయానికి తరలించారు. 41ఏ సీఆర్పీసీ కింద యష్‌కు నోటీసులిచ్చారు. 2024 జనవరి 11న తిరుపతి ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు రావాలని చెబుతూ.. ఆయన్ని విడుదల చేశారు.




పారిస్: మానవ అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారంతో 303 మంది భారతీయులు ప్రయాణిస్తోన్న విమానాన్ని ఫ్రాన్స్ విమానాశ్రయంలో స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ప్రయాణికుల్లో ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ మేరకు ఫ్రాన్స్ అధికారులు మీడియాకు వెల్లడించారు. '303 మంది ప్రయాణికులు, సిబ్బంది గుర్తింపు పత్రాలను తనిఖీ చేస్తున్నాం. అలాగే వారి ప్రయాణానికి గల కారణాలు పరిశీలిస్తున్నాం' అని తెలిపారు. జాతీయ వ్యవస్థీకృత నేర నిరోధక విభాగం నేతృత్వంలో ఈ దర్యాప్తు కొనసాగుతోంది. రొమేనియా సంస్థ లెజెండ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి నికరాగువాకు బయల్దేరింది. ఇంధనం నింపడం కోసం శుక్రవారం ఫ్రాన్స్‌లోని వాట్రీ ఎయిర్‌పోర్టులో దిగింది. అప్పటికే మానవ అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారం అందుకున్న ఫ్రాన్స్ అధికారులు ఆ విమానాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రయాణికుల్లో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

ఇదిలా ఉంటే.. ఆ ప్రయాణికుల్లో మైనర్లు కూడా ఉన్నారని సమాచారం. అమెరికా లేదా కెనడాలోకి అక్రమంగా ప్రవేశించాలనే ప్రణాళికలో భాగంగా ఆ ప్రయాణికులంతా నికరాగువాకు వెళ్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటనపై ఫ్రాన్స్‌లోని భారత రాయబార కార్యాలయం స్పందించింది.

ఈ ఘటన గురించి ఫ్రాన్స్ అధికారులు వెల్లడించినట్లు పేర్కొంది. 'దౌత్య బృందానికి కాన్సులర్ యాక్సెస్ లభించింది. ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నాం. ప్రయాణికుల భద్రత కోసం చర్యలు తీసుకుంటున్నాం' అని వెల్లడించింది. ఆ ప్రయాణికులంతా యూఏఈలో పనిచేస్తుండొచ్చని లెజెండ్ సంస్థ పేర్కొంది. తమ వైపు నుంచి ఎలాంటి తప్పులేదని విశ్వసిస్తున్నట్లు చెప్పింది.

# నంది నాటకోత్సవాలు: సీఎం జగన్ 100 అడుగుల కటౌట్






గుంటూరు: నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురాడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్, టీవీ, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నంది నాటకోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం బీసీ వెల్ఫేర్, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి నాటకోత్సవాలను ప్రారంభించారు. నంది నాటకోత్సవాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీఎం జగన్ 100 అడుగుల భారీ కటౌట్ ఆకట్టుకుంటోంది. ప్రాథమిక దశలో మెప్పించి తుది పోటీలకు అర్హత పొందిన కళాకారులు ఈ ఉత్సవాల్లో సత్తా చాటి బహుమతులు సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. మొత్తం ఐదు విభాగాలుగా పోటీలు జరగనున్నాయి. పద్య, సాంఘిక నాటకాలు, సాంఘిక నాటికలు, కళాశాల, యూనివర్సిటీ స్థాయి నాటికలు, బాలల నాటికల ప్రదర్శనలు ఆహూతులను అలరించనున్నాయి. ఈ పోటీల్లో 73 అవార్డులు గెలుచుకోవడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా 38 నాటక సమాజాల నుంచి 1,200 మంది కళాకారులు పాల్గొంటున్నారు. కళాకారులకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా ఏర్పాట్లు చేశారు. నాటక ప్రదర్శనలను కళాకారులు, విద్యార్థులు, కళాభిమానులు ఉచితంగా తిలకించే అవకాశం కల్పించారు. ఈ వేడుకలు 29 వరకు జరగనున్నాయి.

# ఐఆర్ఆర్ కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్



అమరావతి: ఇన్నర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది. ప్రభుత్వం దాఖలు చేసిన లిఖిత పూర్వక వాదనల్లో టీడీపీ నేత లోకేష్‌పై చేసిన వ్యాఖ్యలపై టీడీపీ న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా చంద్రబాబు తరపు న్యాయవాదులు ఈరోజు (శనివారం) హైకోర్టులో దాఖలు చేశారు. వీటిని పరిశీలించిన హైకోర్టు నాయమూర్తి.. చంద్రబాబు ముందస్తు బెయిల్‌పై తీర్పును రిజర్వ్ చేశారు.

# ఏపీలో ఎన్నికల సన్నద్ధతపై రెండో రోజు ఈసీ బృందం సమీక్ష




విజయవాడ: ఏపీలో కేంద్ర ఎన్నికల సంఘం బృందం పర్యటన కొనసాగుతోంది. విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో రెండో రోజు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2024, ఎన్నికల సన్నద్ధత కార్యకలాపాలపై ఈసీ బృందం రెండో రోజు సమీక్ష నిర్వహించింది. రాష్ట్ర ఎన్నికల అధికారులు, ఎస్పీలు, కలెక్టర్లతో బృందం చర్చలు జరిపారు. ఓటర్ల జాబితా, పోలింగ్ సన్నద్ధత, ఇతర అంశాలపై చర్చించారు. తొలి రోజు శుక్రవారం 18 జిల్లాలపై సమీక్ష పూర్తికాగా.. ఇవాళ మరో 8 జిల్లాలపై ఈసీ బృందం సమీక్షించింది. చెక్‌పోస్టులు, తనిఖీ కేంద్రాల ఏర్పాటుపై ఆరా తీశారు. సమస్యాత్మక, సున్నిత ప్రాంతాల్లో భద్రత ప్రత్యేక దృష్టిపెట్టాలని అధికారులకు ఈసీ బృందం దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ఓటర్ల జాబితాలో అవకతవకలు ఎక్కువగా ఉన్న జిల్లాలపై ఎలాంటి పర్యవేక్షణ ఉండాలన్న దానిపై సీఈవోకు కొన్ని సూచనలు చేసినట్లు తెలుస్తోంది.

## చీరలో వర్కవుట్లు ఎలా సాధ్యం రష్మికా?

అవును.. ఈ బ్యూటీ నల్ల కోకలో సౌకర్యం గురించి చాలా ఆశ్చర్యపోయే సంగతి చెప్పింది. నల్ల చీర ధరించి సౌకర్యంగా వర్కవుట్లు చేయగలనని అంది. అంతగా తనకు ఈ చీర నచ్చేసింది మరి. ఇంతకీ ఎవరీ భామ? అంటే ప్రత్యేకించి పరిచయం అవసరం లేదు. యానిమల్ సక్సెస్ తో జోష్ లో ఉన్న రష్మిక మందన్న ఇప్పుడు నల్ల కోకలో ప్రత్యక్షమైంది. ఈ చీర డిజైన్ ఎంతో ఆకట్టుకుంది. తాజాగా చీర లో తన సొగసును ఫోటోల రూపంలో షేర్ చేసిన రష్మిక.. ఇన్ స్టాలో ఇలా రాసింది. నేను ఈ చీర మెటీరియల్‌ని చాలా ఇష్టపడ్డాను. బహుశా



నిద్ర, మేల్కొలనడం – వ్యాయామం చేయగలనని అనుకుంటున్నాను. నా కార్డియో, ఫిల్మ్ షూట్, ప్రతిదీ చేయగలను అని రాసింది. ప్రస్తుతం హైదరాబాద్ లో తెలుగు సినిమా చిత్రీకరణలో పాల్గొంటున్న రష్మిక మందన ఉన్నట్టుండి ఇలా చీర గురించి ముచ్చటిస్తుందేమిటీ? అంటూ అభిమానులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ చీరలో అంత ప్రత్యేకత ఏం ఉందీ అంటూ ఆరాలు తీస్తున్నారు. ఇది సాధారణ అపారదర్శక నలుపు రంగు చీర. దానికోసం ఉపయోగించిన మెటీరియల్ సౌకర్యంగా ఉందనేది రష్మిక ఉద్దేశం. ఇది నలుపుపై నారింజ పువ్వుల డిజైన్ తో ఎంతో స్పెషల్ గా కనిపిస్తోంది. స్లీవ్‌లెస్ బ్లాక్ బ్లౌజ్ ని కవరప్ చేస్తూ చీరలో రష్మిక ఎంతో అందంగా కనిపిస్తోంది. సొగసైన చీరలో రష్మిక మేటి నటి సుహాసినిని తలపిస్తోందని అభిమానులు భావిస్తున్నారు. సుహాసిని, విజయశాంతి, రాధ ఆ రోజుల్లో ఇలాంటి చీరలు ధరించి కుర్రకారు గుండెల్ని కొల్లగొట్టారని గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడు రష్మిక కూడా క్లాసిక్ నాయికల జాబితాలో చేరిపోయింది. యానిమల్ గురించి మర్చిపోయి ఇలా స్వేచ్ఛగా నల్ల కోక గురించే ముచ్చటిస్తోందంటే దానికి కారణం కూడా సహేతుకమేనని అర్థమవుతోంది.

## అనుష్క క్రేజ్ కొవొత్తిలా కరిగిపోతుందా?

టాలీవుడ్ కి తారా జువ్వలా దూసుకొచ్చింది బెంగుళూరు బ్యూటీ అనుష్క. తొలి సినిమా సూపర్ తో యావరేజ్ సక్సెస్ అందుకుంది. అటుపై రెండు వైఫల్యాలుఎదురైనా విక్రమార్కుడుతో బ్లాక్ బస్టర్ ఖాతాలో వేసుకుంది. అప్పటి నుంచి అమ్మడి కెరీర్ వెనక్కి తిరిగి చూడకుండా సాగిపోయింది. దాదాపు పదహారు.. పదిహేడేళ్ల పాటు అనుష్క పేరు మార్కెట్ లో ఓ బ్రాండ్ గామారు మ్రోగింది. అరుంధతి.. భాగమతి లాంటి లేడీ ఓరియేంటెడ్ చిత్రాలతోనూ బాక్సాఫీస్ వద్ద సత్తా చాటింది. అనుష్క ఫాంలో ఉన్నంత కాలం అవకాశాలన్ని ఆమ్మడివే. ఇంకా కెరీర్ లో ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకుల్ని అలరించింది. బాహుబలి లాంటి పాన్ ఇండియాని దాటి ఫేమస్ అయింది. కానీ అటుపై అనుష్క కెరీర్ కొవ్వొత్తిలాగే కరిగిపోతుందన్నది తాజాగా నెటి జనుల మాటగా వినిపిస్తుంది. మునుపటి ఛరిష్మా ఎక్కడ? అప్పటి క్రేజ్ ఎక్కడ? ఆనాటి అనుష్క



ఎక్కడా? అంటూ వెతుక్కోవాల్సిన సన్నివేశం ఎదురవుతుంది. ఎందుకంటే అనుష్క తాజా పరిస్థితి అలాగే కనిపిస్తుంది. అనుష్క కంటే ముందు..వెనుక వచ్చిన నాయికలు ఎంతో మంది ఫాంలో కనిపిస్తున్నారు. కానీ అనుష్క అవకాశాలు వచ్చినా చేయడం లేదా? రాక ఖాళీగా ఉంటుందా? ఇలా కారణం ఏదైనా అమ్మడు రేసులో వెనుకబడింది అన్నది వాస్తవంగా కనిపిస్తోంది. త్రిష..నయనతార.. కాజల్ అగర్వాల్.. తమన్నా ...పూజా హెగ్డేలా అమ్మడు లైమ్ లైట్ లో లేకుండా పోతున్నట్లు కనిపిస్తోంది. వీళ్లంతా కూడా ఒకానొద దశలో బ్యాడ్ ఫేజ్ ని చూసినవారే. కానీ తమ ఐడెంటిటీని మాత్రం ఏనాడు కోల్పోలేదు. అభిమానులకు ఏదో రూపంలో టచ్ లో ఉండేవారు. నయన్..త్రిషని మినహాయిస్తే! కాజల్..తమన్నా మాత్రం ఇన్ స్టా యాక్టివిటీతోనే చాలా కాలం పాటు తమ ఫాం ని కొనసాగించగలిగారు. ఆ రకమైన క్రేజ్ సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ తోడ్పడింది. ఇప్పుడు వాళ్లిద్దరు అవకాశాలు అందుకుని బిజీగా ఉన్నారు? యవతలో హాట్ టాపిక్ గా మారుతున్నారంటే? కారణం ఆ రకమైన చర్యలే. ఈ విషయంలో మాత్రం అనుష్క చాలా వెనుకబడి ఉంది. ఇన్ స్టా..ట్విటర్..ఫేస్ బుక్ లాంటి మాధ్యమాల్లో అనుష్క కనిపించదు. హాట్ ఫోటోల సంగతి పక్కనబెడితే.. కనీసం తనకు సంబంధించిన ఏ అప్ డేట్ కూడా ఉండదు. ఇలా ఇన్ని రకాల కారణాలతో అనుష్క క్రేజ్ డే బై డే కొవ్వొత్తిలా కరిగిపోతున్నట్లే కనిపిస్తోంది.




## ఒకేసారి రెండు ట్రైలర్స్.. కొత్త ట్రెండు




ఓ వైపు హీరోగా సినిమాలు చేస్తూనే మరోవైపు ఉప్పెన, విక్రమ్, జవాన్ వంటి పలు సినిమాల్లో విలన్‌గా మెప్పిస్తున్నారు మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి. పాత్ర నచ్చితే డ్యురేషన్ ఎంతని ఆలోచించకుండా నటించే అతికొద్ది మంది నటుల్లో విజయ్ సేతుపతి ఒకరు. ప్రస్తుతం ఆయన చేతి నిండా సినిమాలో బిజీబిజీగా గడుపుతున్నారు. అందులో మెర్రీ క్రిస్మస్ ఒకటి. బాలీవుడ్ బ్యూటీ కత్రినా కైఫ్ హీరోయిన్గా నటిస్తున్న ఈ చిత్రాన్ని బద్లాపూర్, అంధాదూన్ వంటి బ్లాక్ బస్టర్ సినిమాలు తెరకెక్కించిన శ్రీరామ్ రాఘవన్ రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాను రిలీజైన టైటిల్ పోస్టర్‌కు విశేష స్పందన వచ్చింది. తాజాగా మేకర్స్ ఈ సినిమా ట్రైలర్ను విడుదల చేశారు. దాంతోపాటు రిలీజ్ డేట్పై కూడా క్లారిటీ ఇచ్చారు. తమిళం, హిందీలో ఒకే కంటెంట్తో ఈ సినిమా తెరకెక్కినప్పటికీ ట్రైలర్లు మాత్రం వేర్వేరుగా విడుదల చేశారు మేకర్స్. హిందీ వెర్షన్ కాస్త స్పీడ్గా ఉంది. క్రిస్మస్ ముందు రోజు జరిగే మర్డర్ మిస్టరీ కమ్ లవ్ను హిందీ ట్రైలర్లో చూపించారు. విజయ్– కత్రిన లిప్ లాక్ సీన్ను యాడ్ చేశారు. అయితే ఈ మూవీ తమిళ ట్రైలర్లో కాస్త హెూమ్లీ టచ్ ఉంది. లిప్ లాక్ సీన్ను ఈ ట్రైలర్లో మేకర్స్ యాడ్ చేయలేదు. క్రైమ్ థ్రిల్లర్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు చెందిన రెండు ట్రైలర్లు.. మూవీపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. శ్రీరామ్ రాఘవన్.. సినిమాలో ఫుల్ ట్విస్టు, సర్ప్రైజ్లు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ రెండు ట్రైలర్‌లు సినీ ఇండస్ట్రీలో టాక్ ఆఫ్ ది టౌన్గా మారాయి. ఎందుకంటే ఒక చిత్రం నుంచి రెండు ట్రైలర్లు రిలీజ్ చేయడం ఇదే తొలిసారి. మ్యాచ్ బాక్స్ పిక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి రమేష్ తౌరానీస్ టిప్స్ ఇండస్ట్రీస్ ఈ చిత్రాన్ని నిర్మించారు. వచ్చే ఏడాది జనవరి 12వ తేదీన ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి, కత్రినా కైఫ్‌తో పాటు సంజయ్ కపూర్, వినయ్ పాఠక్, ప్రతిమ కన్నన్, టిన్నూ ఆనంద్ నటిస్తున్నారు. తమిళ వెర్షన్‌లో రాధికా శరత్‌కుమార్, షణ్ముగరాజా, కెవిన్ జే బాబు, రాజేష్ విలియమ్స్ అదే పాత్రల్లో కనిపించనున్నారు. అయితే తెలుగులో ఈ సినిమా డబ్ కావడం లేదని సినీ వర్గాల టాక్.

## శేష్ ఎక్స్ శృతి.. ముసుగు వెనక మర్మం ఏంటో..?




టాలీవుడ్ యంగ్ హీరోల్లో డిఫరెంట్ సినిమాలు చేస్తూ ప్రేక్షకులను మెప్పిస్తూ వస్తున్నాడు అడివి శేష్. లిమిటెడ్ బడ్జెట్ తో అతను చేస్తున్న సినిమాలు తెలుగు సినిమాల స్థాయిని పెంచేలా చేస్తున్నాయి. తనకంటూ ఒక టీం ని ఏర్పరచుకుని అడివి శేష్ చేస్తున్న ప్రయత్నాలన్నీ కూడా సక్సెస్ అవుతున్నాయి. అందుకే ఏ యువ హీరోకి లేని క్రేజ్ అడివి శేష్ కి ఉంది. అతని నుంచి సినిమా వస్తుంది అంటే ఆడియన్స్ అంతా కూడా అలర్ట్ అయ్యేలా క్రేజ్ తెచ్చుకున్నాడు. ఇక లేటెస్ట్ గా అడివి శేష్ తన నెక్స్ట్ సినిమా అప్డేట్ తో ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేశాడు. శేష్ ఎక్స్ శృతి అంటూ ఒక పోస్టర్ తో వచ్చాడు అడివి శేష్. రీసెంట్ గా అడివి శేష్ పోస్టర్ రిలీజ్ చేశారు. ముసుగుతో ఉన్న శేష్ ఇంటెన్స్ లుక్ ఆడియన్స్ ని ఇంప్రెస్ చేసింది. ఇక లేటెస్ట్ గా శేష్ ఎస్ శృతి నుంచి శృతి హాసన్ పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. అదే ముసుగుతో శృతి కూడా ఇంటెన్స్ లుక్ తో కనిపించింది. మరి శేష్ ఎక్స్ శృతి ఈ ముసుగు వెనుక ఉన్న మర్మం ఏంటన్నది తెలియాల్సి ఉంది. అంతేకాదు ఈ సినిమాకు టైటిల్ ని డిసెంబర్ 18న రిలీజ్ చేస్తారని తెలుస్తుంది. శేష్, శృతి హాసన్ నటిస్తున్న ఈ సినిమాను షానియెల్ డియో డైరెక్ట్ చేస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ లో ఈ సినిమాను సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. క్షణం, గూఢచారి, హిట్ 2, మేజర్ ఇలా తన ప్రతి సినిమాతో తెలుగు ఆడియన్స్ కు సరికొత్త సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇస్తున్న అడివి శేష్ ఈసారి నెక్స్ట్ లెవెల్ లో ఆడియన్స్ ని అలరించాలని ఫిక్స్ అయ్యాడు. ఓ పక్క గూడచారి 2 పనులు జరుగుతుండగా శేష్ ఎక్స్ శృతి సినిమాతో థ్రిల్ చేయనున్నాడు. కంటెంట్ ఉన్న సినిమాలతో ఆడియన్స్ ని అలరిస్తూ వస్తున్న అడివి శేష్ రాబోతున్న సినిమాలతో కూడా తన టార్గెట్ రీచ్ అవ్వాలని చూస్తున్నాడు. సినిమా టెంప్లేట్ మార్చేస్తున్న అడివి శేష్ తెలుగు తెర మీద సరికొత్త కథ కథనాలను తీసుకొచ్చే ప్రయత్నం లో ఉన్నాడు. శేష్ ఎక్స్ శృతి పోస్టర్స్ తోనే సినిమాపై మంచి బజ్ ఏర్పడుతుండగా సినిమా నుంచి టీజర్ వస్తే కానీ కొంత క్లారిటీ వస్తుందని చెప్పొచ్చు.

## ఆ ఇద్దరి భామల సెగలకి ఆహుతవ్వాల్సిందే!

సాధారణంగా ఒక బ్యూటీ ఎలివేషన్లను తట్టుకోవడమే సాధ్యమవ్వడం కష్టమైన పని. అందులోనూ ఒకేసారి ఇద్దరు బ్యూటీలు పోటీ పడి మరీ అందాల దాడి చేస్తే ఎలా ఉంటుంది? ఆ వేడిని...ఆ సెగని తట్టుకోవడం అంత వీజీనా? అవును ఈ ఫోటో చూసిన తర్వాత ఇది నిజమే అనక తప్పదు. ఒకేసారి ఇదిగో ఇక్కడిలా ఇద్దరు భామలు టూపీస్ ట్రీట్ షురూ చేసారు. మౌనీరాయ్..దిశాపటానీ పనిగట్టుకుని మరీ స్ట్రైయికింగ్ చేసారిలా. బీచ్ లో ఇలా భామా మణులిద్దరు కెమెరాకి వివిధ భంగిమల్లో ఫోజులిచ్చారు. మౌనీరాయ్ కళ్లకు గ్లాసెస్ ధరించి...డార్క్ బ్లూ పీస్ లో..దిశా పటానీ ఎరుపు వర్ణం బ్లౌజులో సెగలు పుట్టిస్తున్నారు. ఇద్దరు పక్కపక్కనే కూర్చుని కెమెరా వైపు చూస్తూ



ఇలా కవ్వించేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. ఒకేసారి రెండు అందాల్ని చూడటానికి రెండు కళ్లు సరిపోవడం లేదు. కాదు వెయి కళ్లు ఉన్నా! ఇలా ఒకేసారి తనివి తీరడం అన్నది సాధ్యంకాని పనిగానే కనిపిస్తుంది. భామలిద్దరు అందాల దాడి చేస్తుంటూ చూసి తట్టుకోవడం కుర్రాళ్లకి సాధ్యమవ్వడం లేదు. ఇక ఆ ఫోటోల కింద కామెంట్లు చూస్తే మతి పోవాల్సిందే. ఎవరి స్టైల్లో వారు భామా మణుల ఇద్దరి బ్యూటీనీ ఆకాశానికి ఎత్తేస్తున్నారు. ఇక ఇద్దరి భామల కెరీర్ గురించిచెప్పాల్సిన పనిలేదు. దిశా పటానీ బాలీవుడ్ తో పాటు సౌత్ లోనూ అవకాశాలు అందుకుంటోంది. సూర్య హీరోగా నటిస్తోన్న పాన్ ఇండియా పిరియాడిక్ చిత్రం కంగువాలో నటిస్తోంది. ఇందులో అమ్మడు సాహసోపేతమైన పాత్రలో ప్రేక్షకుల్ని మెప్పించబోతుంది. అలాగే మౌనీ రాయ్ సీరియల్స్ ని వెండి తెరకు ప్రమోట్ బిజీ నాయికగా మారిపోయింది. బాలీవుడ్ కొత్త అవకాశాలు క్యూ కడుతున్నాయి. వీటికి తోడు ఇన్ స్టాలో హాట్ ట్రీట్ తో మరింత పాపులర్ అయింది. సినిమాల్ని మించిన గొప్ప పాపులారిటీ బ్యూటీకి ఇన్ స్టా తీసుకొచ్చింది. లక్షల్లో ఫాలోవర్స్ ని సంపాదించుకుంది.

## స్కిన్ షోతో నేషనల్ క్రష్‌గా మారింది.. ఇదెట్లా?

యానిమల్ స్టార్ ట్రిప్తీ డిమ్రీ పేరు అన్ని పరిశ్రమల్లో మార్మోగుతోంది. ఇటీవల ఈ బ్యూటీ..ప్రముఖ ఫోటోగ్రాఫర్ కం వ్యాపారవేత్త రాహుల్ ఝాంగియాని వివాహ వేడుకల కోసం గోవాకు వెళ్లింది ట్రిప్తీ. స్పాట్ నుంచి అందమైన ఫోటోలు వైరల్ అయ్యాయి. యాక్షన్ థ్రిల్లర్ యానిమల్ విజయాన్ని ఆస్వాధిస్తున్న ట్రిప్తీ డిమ్రీ తనకంటూ పెద్ద ఫ్యాన్ ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. ఈ చిత్రంలో ఘాటైన నటనతో ట్రిప్తీ షో స్టాపర్ గా నిలిచింది. ఇంటర్నెట్‌లో నేషనల్ క్రష్ –భాభి 2గా పిలుపందుకుంటున్న ట్రిప్తీ యానిమల్ విడుదలైనప్పటి నుండి చాలా మంది ప్రజల దృష్టిని ఆకర్షించింది. ఈ విజయాన్ని ఆస్వాధిస్తూనే స్నేహితురాలి వివాహానికి హాజరై పండుగ సీజన్‌కు గ్లామర్ ను జోడించింది. తాజాగా ట్రిప్తీ కొత్త ఫోటోషూట్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. అచ్చం క్రిస్మస్ ట్రీని



తలపించేలా అందమైన పచ్చ రంగు మిరుమిట్ల దుస్తుల్లో ఈ భామ కనిపించింది. క్రిస్మస్ ట్రీ ఫోటోని కూడా ఇన్ స్టాలో షేర్ చేసింది ఈ బ్యూటీ. ఈ ఫోటోషూట్ ప్రస్తుతం యువతరంలో వైరల్ గా మారుతోంది. ఇంతలోనే ఒక అభిమాని తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసాడు. "బుల్‌బుల్ & ఖలాలో ఆమె తన ప్రతిభను ప్రదర్శించినప్పుడు ఎవరూ గమనించలేదు.. తన శరీరాన్ని చూపించినప్పుడు సెన్సేషనల్ నేషనల్ క్రష్‌గా మారింది..." అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసాడు. కెరీర్ మ్యాటర్‌కి వస్తే.. ట్రిప్టి డిమ్రీ తదుపరి రెండు భారీ సినిమాలు చేస్తోంది. తదుపరి విక్కీ కౌశల్ సరసన మేరే మెహబూబ్ మేరే సనమ్ లో ప్రభాస్ సరసన స్పిరిట్ లో నటించనుంది. రాజ్‌కుమార్ రావు తో 'విక్కీ విద్యా కా వో వాలా' వీడియోలోను నటిస్తోంది. యానిమల్ లో గ్లామర్ షోతో ఆకట్టుకోక ముందే పలు చిత్రాల్లో అద్భుత నటనతో మెప్పించింది ఈ బ్యూటీ. కానీ అప్పట్లో ఎవరూ అంతగా గుర్తించలేదు. ఇప్పుడు స్కిన్ షోతో నేషనల్ క్రష్ గా మారింది.



# భాగ్యనగరంలో ముగిసిన రాష్ట్రపతి శీతాకాల విడిది

హైదరాబాద్: భాగ్యనగరంలో భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శీతాకాల విడిది ముగిసింది. శనివారం ఆమె హకీంపేట వైమానిక కేంద్రం నుంచి బయలుదేరి ఢిల్లీ వెళ్లారు. రాష్ట్రపతికి గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వీడ్కోలు పలికారు. అంతకుముందు ఆనవాయితీలో భాగంగా బొల్లారంలోని తన నివాసంలో రాష్ట్రపతి శుక్రవారం తేనీటి విందు (ఎట్ హోం)ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గవర్నర్, సీఎంలతో పాటు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులందరినీ రాష్ట్రపతి పేరుపేరునా పలకరించారు. గవర్నర్ తమిళిసై ఆమెకు శివుడి ప్రతిమను బహూకరించారు. కాగా, డిసెంబరు 18న శీతాకాల విడిది కోసం హైదరాబాద్ బొల్లారంలోని నివాసానికి రాష్ట్రపతి విచ్చేసిన సంగతి తెలిసిందే. పర్యటనలో భాగంగా పోచంపల్లిని రాష్ట్రపతి సందర్శించారు. థీమ్ పెవిలియన్ పార్కులో చీరల తయారీ యూనిట్‌కు వెళ్లి.. అక్కడ కార్మికులు మగ్గాలపై నేస్తున్న చీరలను ఆసక్తిగా పరిశీలించారు. నేత కార్మికులతోనూ ముచ్చటించారు.

# పీవీ ఘాట్ వద్ద గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్ నివాళి



హైదరాబాద్: భారత దేశ కీర్తిని ప్రపంచానికి చాటిన గొప్ప మేధావి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. పరిపాలనలో మార్పులు తెచ్చి ఎంతో మందికి ఆయన ఆదర్శంగా నిలిచారన్నారు. దేశాన్నీ బలమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దారని చెప్పారు. పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా.. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని 'పీవీ జ్ఞానభూమి' వద్ద పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. పీవీ సమాధి వద్ద గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్ శ్రద్ధాంజలి ఘటించారు. ప్రధానిగా ఆయన దేశానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.

జాతి గర్వించదగ్గ మహనీయుడు పీవీ అని కొనియాడారు. పీవీ కీర్తిని పెంచాలా తమ ప్రభుత్వం పనిచేస్తుందని రేవంత్ అన్నారు.

**భూ సంస్కరణలు అమలు చేసిన వ్యక్తి పీవీ: భట్టి –** ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో జరిగిన పీవీ నరసింహారావు వర్ధంతి కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరై నివాళులర్పించారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన ఘనత పీవీ నరసింహారావుకే సొంతమని చెప్పారు. విద్యావ్యవస్థ సహా అనేక సామాజిక మార్పులకు కృషి చేశారని, భూ సంస్కరణలు అమలు చేసిన వ్యక్తి పీవీ అని కొనియాడారు.

# దేశ కీర్తిని ప్రపంచానికి చాటిన గొప్ప మేధావి పీవీ..



హైదరాబాద్: దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 19వ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. శనివారం పీవీ జ్ఞాన భూమి వద్ద సీఎం, మంత్రులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ... దేశ కీర్తిని ప్రపంచానికి చాటిన గొప్ప మేధావి పీవీ అని కొనియాడారు. పరిపాలనలో సమూల మార్పులు తెచ్చి ఆదర్శంగా నిలిచిన వ్యక్తి పీవీ అని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రశ్నార్థకంగా మారినప్పుడు సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారన్నారు. బంగారాన్ని కుదవ పెట్టి అప్పులు తేవడంపై ఆయన ఒకే మాట చెప్పారని.. తెలివైన వాడు సగం ఆస్తిని కుదవపెట్టి అయినా సరే మిగతా ఆస్తిని కాపాడుకుంటారని ఆయన చెప్పారని గుర్తుచేశారు. భూమిని పేదవాడికి అందుబాటులోకి తీసుకొచ్చిన వ్యక్తి పీవీ అని అన్నారు. పేదలకు భూములు పంచడానికి పీవీ బలమైన పునాదులు వేశారని తెలిపారు. పీవీ మన మధ్య లేకపోయినా వారి సంస్కరణలు సదా ఆచరణీయమని చెప్పుకొచ్చారు. పీవీ ఘాట్, జైపాల్ రెడ్డి ఘాట్‌లను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వీరిద్దరూ తెలంగాణకు లంకె బిందెల్లాంటి వారన్నారు. పీవీ కీర్తిని పెంచేలా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# భారాస పాలనపై 'స్వేద పత్రం' విడుదల వాయిదా



హైదరాబాద్: భారాస తొమ్మిదిన్నరేళ్ల పాలనపై 'స్వేద పత్రం' విడుదల కార్యక్రమం ఆదివారానికి వాయిదా పడింది. 'స్వేద పత్రం' పేరిట పవర్ పాయింట్ ప్రజంటేషన్(పీపీటీ)ను భారాస ఇవ్వనుంది. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఇవాళే ఈ కార్యక్రమం జరగాల్సి ఉండగా.. పలు కారణాల రీత్యా రేపటికి వాయిదా వేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. 'స్వేద పత్రం' విడుదలపై అంతకుముందు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ట్విటర్ వేదికగా వెల్లడించారు. "తొమ్మిదిన్నరేళ్ల తెలంగాణ ప్రగతి ప్రస్థానం.. దేశ చరిత్రలోనే ఓ సువర్ణ అధ్యాయం. పగలూ రాత్రి తేడా లేకుండా.. రెక్కల కష్టంతో చెమటోడ్చి నిర్మించిన తెలంగాణ ప్రతిష్ఠను దెబ్బతీస్తే సహించం.

విఫల రాష్ట్రంగా చూపించాలని ప్రయత్నిస్తే భరించం. అగ్రగామి రాష్ట్రాన్ని అవమానిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకోం. అందుకే గణాంకాలు సహా వాస్తవ తెలంగాణ ముఖచిత్రాన్ని వివరించేందుకు.. అప్పులు కాదు.. తెలంగాణ రాష్ట్రానికి సృష్టించిన సంపదను ఆవిష్కరించేందుకు.. తెలంగాణ భవన్ వేదికగా 'స్వేద పత్రాన్ని' ప్రజల ముందు ఉంచనున్నాం" అని కేటీఆర్ పేర్కొన్నారు.

# హుస్నాబాద్ ప్రజలకు రుణపడి ఉంటా



సిద్దిపేట జిల్లా: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా స్వామి వారిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తనను గెలిపించిన హుస్నాబాద్ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని స్వామి వారిని కోరుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రజా సమస్యలను పరిష్కరించేలా తనకు భగవంతుడు ఆశీస్సులు అందించాలని వేడుకున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# కలెక్టర్లతో సమీక్ష తర్వాత సీఎం రేవంత్ తీపి కబురు చెబుతారు: పొంగులేటి



హుజూర్‌నగర్: కలెక్టర్లతో సమీక్ష తర్వాత సీఎం రేవంత్ రెడ్డి తీపి కబురు చెబుతారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. గత ప్రభుత్వం హామీల విషయంలో మాటలకే పరిమితమైందని విమర్శించారు. హుజూర్‌నగర్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి పొంగులేటి పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. హుజూర్‌నగర్‌లో గత ప్రభుత్వం కేవలం 150 ఇళ్లు మాత్రమే కట్టిందని పొంగులేటి చెప్పారు. కాంగ్రెస్ హయాంలో ప్రతి గ్రామంలో 100కు పైగా ఇళ్లు కట్టామన్నారు. హుజూర్‌నగర్‌లో 2,160 ఇళ్లు పూర్తి చేసి, రాబోయే 3, 4 నెలల్లో అర్హులైన పేదలకు అందజేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ఇరిగేషన్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో అన్యాక్రాంతమైన భూములపై విచారణ జరిపిస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు.

**భారాస హయాంలో అవినీతి, దుర్మార్గ పాలన: ఉత్తమ్ –** మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. భారాస హయాంలో అవినీతి, దుర్మార్గ పాలన సాగిందని ఆరోపించారు. నీటిపారుదల శాఖలో అనేక లోటుపాట్లు ఉన్నాయన్నారు. చెక్‌డ్యామ్‌లపై కూడా చాలా ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. ఎన్నికల వేళ ఇచ్చిన 6 గ్యారంటీలకు కట్టుబడి ఉన్నామని, ఇప్పటికే రెండు గ్యారంటీలు అమలు చేశామన్నారు. గ్యాస్ స్కీమ్‌ను త్వరలోనే అమలు చేస్తామని వెల్లడించారు.




# మీ-సేవ ద్వారా స్వీకరణ! - గ్రామ, బస్తీ సభల ద్వారా కార్డుదారుల ఎంపిక

హైదరాబాద్: రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుంది. ఈ నెల 28వ తేదీ నుంచి దరఖాస్తులు ఆహ్వానించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. మీ-సేవ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకోనున్నట్లు తెలిసింది. అర్హుల ఎంపిక ప్రక్రియను క్షేత్రస్థాయిలోనే చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అవసరమైన పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాక వీటి పరిశీలన మొదలవుతుంది. అర్హుల ఎంపిక ప్రక్రియ గ్రామాల్లో గ్రామసభలు.. నగరాలు, పట్టణాల్లో బస్తీసభల ద్వారా జరుగుతుందని పౌర సరఫరాల శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రక్రియకు ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించనున్నట్లు సమాచారం.

**లక్షల కుటుంబాల ఎదురుచూపులు..** రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల కోసం లక్షల కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. బియ్యం వంటి సరకుల కోసమే కాకుండా ఆరోగ్యశ్రీ వంటి పలు పథకాలకూ రేషన్ (ఆహార భద్రత) కార్డు ఉండాలన్న నిబంధన ఉంది. ఆరోగ్యశ్రీ పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. అర్హత కలిగినప్పటికీ అనేక కుటుంబాలు రేషన్ కార్డుల్లేక ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధి పొందలేకపోతున్నాయి. రేషన్ కార్డులో పేరున్న ప్రతి వ్యక్తికీ 6 కిలోల చొప్పున బియ్యం అందుతున్నాయి. హైదరాబాద్‌లో గోధుమలు కూడా ఇస్తున్నారు. గతంలో కిలో బియ్యం రూపాయికే ఇవ్వగా.. కొవిడ్ ప్రభావం నేపథ్యంలో మూడేళ్లుగా ఉచితంగానే బియ్యం ఇస్తున్నారు.

అన్నపూర్ణ అంత్యోదయ యోజన కార్డులు ఉన్నవారికి నెలకు కిలో చక్కెర ఇస్తున్నారు. కాగా రేషన్ కార్డుల జారీకి అర్హుల ఎంపికకు మార్గదర్శకాలు ఖరారు కావాల్సి ఉంది. గతంలో ఉన్న మార్గదర్శకాలే కొనసాగే అవకాశాలు లేకపోలేదని పౌరసరఫరాలశాఖ అధికారి ఒకరు తెలిపారు. ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరాయని, కొత్త రేషన్ కార్డులకు అర్హుల ఎంపిక గ్రామ, బస్తీ సభల్లోనే జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

**మార్పులు చేర్పులు సైతం..** రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు.. తప్పులను సరిచేయడానికి సైతం ఈనెల 28వ తేదీ నుంచి అవకాశం కల్పించనున్నట్లు తెలిసింది. శాసనసభ ఎన్నికల ముందు నాటికే ఈ జాబితాలో 11.02 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే ఉన్న కార్డుల్లో పిల్లలు, కుటుంబసభ్యుల పేర్లు చేర్చాలని దరఖాస్తుదారులు కోరారు. ఎడిట్ ఆప్షన్ ప్రభుత్వం ఇవ్వకపోవడంతో ఆ ప్రక్రియ ఇన్నాళ్లూ ముందుకు సాగలేదు. రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. కొత్త కార్డుల జారీకి దరఖాస్తుల ఆహ్వానంతో పాటు ఇప్పటికే ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యుల్ని చేర్చేందుకు అనుమతివ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. 11.02 లక్షల దరఖాస్తులకు సంబంధించి 15.87 లక్షల మంది పేర్లను ఆహారభద్రత కార్డుల్లో చేరాలని ఇప్పటికే దరఖాస్తులు వచ్చాయి. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. తెలంగాణ ఆవిర్భవించాక 6,47,297 రేషన్‌కార్డులు జారీచేసినట్లు పౌరసరఫరాలశాఖ గణాంకాలు చెబుతున్నాయి. వీటికింద 20,69,033మంది లబ్ధిదారులున్నారు. రాష్ట్రంలో ఇంతవరకు మొత్తం 2.82 కోట్ల మందికి పైగా రేషన్ లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ కింద 1,91,69,000 (68%), రాష్ట్ర కార్డులకు సంబంధించి 91,30,000 (32%) మంది ఉన్నారు.




# 2023 ఏడాది నేరాలపై సైబరాబాద్ సీపీ ఏమన్నారంటే?

హైదరాబాద్: మరికొద్దిరోజుల్లో కొత్త సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా 2023 ఏడాదిలో నమోదైన నేరాలపై సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి రివ్యూ నిర్వహించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. గత ఏడాదితో పోలిస్తే 8 శాతం క్రైమ్ రెట్ పెరిగిందని సీపీ వెల్లడించారు. సైబరాబాద్ పరిధిలో ఈ ఏడాదిలో 29156 ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యినట్లు తెలిపారు. ఈ ఏడాది 3432 మందికి శిక్షలు ఖరారు అయినట్లు చెప్పారు. అలాగే 5342 సైబర్ క్రైమ్ కేసులు నమోదు అవగా.. సైబర్ క్రైమ్ ద్వారా రూ.232 కోట్లు మాయం అయినట్లు వెల్లడించారు. దీంట్లో రూ.46 కోట్లు రికవరీ అయినట్లు తెలిపారు. 277 డ్రగ్స్ కేసులు నమోదు అవగా.. 567 మంది అరెస్ట్ అయ్యారన్నారు. డ్రగ్స్ కేసుల్లో ఇద్దరిపై పీడీ యాక్ట్ నమోదు అయ్యిందన్నారు. 6676 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని.. డ్రగ్స్ కేసుల్లో రూ.27 కోట్లు విలువ చేసే మత్తుపదార్థులు స్వాధీనం చేసుకున్నామన్నారు. 52124 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు అయ్యాయని.. ట్రాఫిక్ ఉల్లంఘనల ద్వారా రూ.104 కోట్ల రూపాయల చలాన్‌లు విధించినట్లు చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించిన 24318 మంది డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేశామన్నారు. షి టీమ్స్ ద్వారా 2587 మంది అరెస్ట్ అయ్యారని.. 52 మందిపై పీడీ యాక్ట్ నమోదు అయినట్లు చెప్పారు. ఎమ్మెల్యే కొనుగోలు కేసు ప్రస్తుతం సుప్రీం కోర్టులో ఉందన్నారు. శ్రీనివాస్ గౌడ్‌పై హత్యాయత్నం కేసులో దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు. సిఫార్సు లేఖలపై పోస్టింగ్‌లు ఉండబోవన్నారు. ప్రతి అధికారిపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. కేపీ చౌదరి డ్రగ్స్‌లో విచారణ కొనసాగుతుందని తెలిపారు. కేపీ చౌదరి కన్ఫెస్ చేసిన ప్రతి ఒక్కరినీ అరెస్ట్ చేస్తామని తెలిపారు. లిస్ట్‌లో ఉన్న అందరినీ విచారణకు పిలుస్తున్నామన్నారు. వారు డ్రగ్స్‌తో ఉన్నపుడు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవాలని ప్రయత్నిస్తున్నామన్నారు. ఎవరిని వదిలిపెట్టమని.. సినిమా వాళ్ళను వదిలి పెడుతున్నామనేది కేవలం ఆరోపణ మాత్రమే అని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి స్పష్టం చేశారు.

**ఈ ఏడాది నమోదైన నేరాలు...** 105 హత్యలు, 61 చైన్ స్నాచింగ్, 62 రాబరీలు, 7 డేకాయిటి, 2353 దొంగతనాలు, 616 కిడ్నాప్‌లు, 259 రేప్ కేసులు, 6777 మోసాలు, 116 హత్యాయత్నాలు.

# సిద్దిపేట అభివృద్ధి కోసం కృషి చేస్తా



సిద్దిపేట జిల్లా: పేద ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. శనివారం నాడు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 153మందికి కళ్యాణలక్ష్మీ, జీఓ 59కింద 71మందికి పట్టాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీష్‌రావు మాట్లాడుతూ... ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న వసతులను ఉపయోగించుకోవాలని చెప్పారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని న్యూట్రిషన్ కిట్ అందిస్తున్నామని అన్నారు. మీ సేవ కోసం సిద్దిపేట అభివృద్ధి కోసం శాయశక్తుల కృషి చేస్తానని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# క్రైస్తవుల హక్కులను కాపాడుతాను



సిద్దిపేట జిల్లా: క్రైస్తవుల సమస్యలు, ఇబ్బందులను పరిష్కరించి వారి హక్కులను కాపాడుతానని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం నాడు హుస్నాబాద్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ... అన్ని మతాలను కాంగ్రెస్ పార్టీ గౌరవిస్తుంది. రాష్ట్రంలో ఎంత ఆర్థిక సంక్షోభం ఉన్న సంక్షేమ కార్యక్రమాలన్ని అమలు చేస్తాం. హుస్నాబాద్‌లోని మోడల్ స్కూల్ లో విద్యార్థులకు కారం పెట్టిన ఘటనపై కలెక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హుస్నాబాద్‌లో మెడికల్ కాలేజ్, ఆర్టీవో కార్యాలయం ఏర్పాటుకు స్థల సేకరణ చేస్తున్నామన్నారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి, భూ నిర్వాసితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసేలా కృషి చేస్తానని చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని నిర్లక్ష్యం చేయనని అన్నారు. రాజకీయాలకు అతీతంగా హుస్నాబాద్ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. 24 గంటలు నియోజర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com